మాయమైన మాధవి

ఏ. వీ. మోహన్రావ్

గంట తొమ్మిదయింది.

మోహినీ స్టుడియోలోని రెండో ఫ్లోర్‌లో ఆర్టిస్టులు, టెక్నీషియన్లు హడావుడిగా తమతమ పనులు చేసుకుంటూ తిరుగుతున్నారు. అందరూ క్రొత్త తారలనే పెట్టి తీస్తున్నారు సినిమా. ఆ రోజు షూటింగులో పాల్గోవలసిన జనమంతా వచ్చేశారు. ఒక్క హీరోయిన్ మాధవి తప్ప.

ప్రొడ్యూసర్ సుబ్బారావు పదిసార్లు సెట్ వెలుపలకు వెళ్ళి చూసొచ్చాడు ఆమె వచ్చిందేమోనని. డైరక్టరు, కెమెరామెన్ ఆమె రానందుకు విసుక్కోసాగారు.

"వేషం ఇచ్చిందాకా కాళ్ళావేళ్ళా పడతారు. తీరా ఇచ్చాక ఒక్కరోజు కెమెరాముందు నిలబడతారు సరిగ్గా.

ఆ తర్వాత మొదలవుతాయి వెధవ వేషాలు" కోపంగా అన్నాడు సుబ్బారావు.

"ప్రొడక్షను కారు వెళ్ళిందా?" అడిగాడు డైరెక్టరు.

"లేదండీ! తనగురించి శ్రమ పడొద్దని చెప్పింది. తనే టాక్సీలో వస్తానంది రోజూ. చెప్పినట్లే ఈ వారంరోజులూ వచ్చింది కూడా. ఇవాళ ఏమొచ్చిందో ఇంతదాకా అంతు లేదు!" అన్నాడు సుబ్బారావు గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ ముట్టిస్తూ.

"రాత్రేదయినా బుకింగ్ వుండిందేమో?" అందుకున్నాడు కెమెరామెన్.

"ఏం చచ్చిందో? ఇప్పుడు చావు నాకొచ్చి పడింది. పాతవాళ్ళను పెట్టుకుంటే పని సరిగ్గా తెమలదని, క్రొత్త వాళ్ళ కోసం పోతే అప్పుడూ ఇలాగే ఏడుస్తూంది!" అన్నాడు సుబ్బారావు.

"ఆమె లేకుండా ఈ దినం పని జరిగే మార్గం లేదు. ప్రతి షాటూ ఆమెతోనే వుంది. కారన్నా పంపండి సార్!" అన్నాడు అసిస్టెంటు డైరక్టరు.

సుబ్బారావు మేనేజర్ని పిలిచి కారు తీసుకెళ్ళమని చెప్పాడు. తలూపి వెళ్ళిపోయాడు మేనేజరు.

ఆ తర్వాత దాదాపు రెండు గంటలసేపు వెయిట్ చేశారు. మాధవి రాలేదు. ఆమెకోసం వెళ్ళిన ప్రొడక్షన్ కారు కూడా రాలేదు. వీసమెత్తు పని జరగలేదు. కాఫీలు త్రాగుతూ, సిగరెట్లు పీలుస్తూ, తాంబూలాలు సేవిస్తూ సెట్లోవున్న జనమంతా ప్రొడ్యూసర్ డబ్బును హారతి కర్పూరంలా చేస్తూ కూర్చున్నారు.

పదకొండున్నరకు మేనేజరు వచ్చాడు.

"వచ్చిందా?" అడిగాడు సుబ్బారావు.

"ఆవిడ గదిలో లేదండీ!" చెప్పాడు.

"లేదా? ఎక్కడికి వెళ్ళిందట."

"ఎవ్వరూ చూడలేదట. ప్రక్క గదిలో ఎక్స్ట్రా వేషాల వెంకాయమ్మను అడిగాను. ఫోన్లో వాళ్ళవాళ్ళు ఎవరో వున్నారని చెప్పిందనీ, ఒకవేళ అక్కడికి వెళ్ళి వుంటుందేమోనంది. ఆ అడ్రసు చెప్పమన్నాను. తనకు సరిగ్గా తెలీదంది. క్రౌన్ టాకీస్ ప్రాంతాల్లో ఎక్కడో వుందా ఇల్లని చెప్పినట్లు గుర్తుగా వుందంది. తిన్నగా అక్కడికి వెళ్ళాను. ఆ హాలు చుట్టుప్రక్కలున్న రోడ్లన్నీ తిరిగాను ఆమె కనపడుతుందేమోనని. లాభం లేక పోయింది. విసుగెత్తి వచ్చేశాను" అన్నాడు మేనేజరు.

సుబ్బారావు విని నీరుగారి పోయాడు. కుర్చీలో జేరబడ్డాడు. ఆ రోజు షూటింగ్ కాన్సిల్ చేసినట్లు ప్రకటించారు. అయినా అందరూ భోజనాలు కంపెనీ ఖర్చులోనే చేసుకుని, కంపెనీ కారులో మెల్లగా ఇళ్ళకు వెళ్ళిపోయారు.

ఆఫీసుకొచ్చాక సుబ్బారావు, మాధవి వస్తుందేమోనని ఎదురు చూస్తూ కూర్చున్నాడు. అలా రాత్రి ఎనిమిదింటి దాకా కూర్చున్నాడు. ఆమె రాలేదు. చెప్పా పెట్టకుండా ఎలా వెళ్ళిందో, ఎందుకు వెళ్ళిందో, ఎంత ఆలోచించినా అతని మెదడుకు తట్టలేదు.

గంట ఎనిమిదిన్నర అవుతూండగా "చిత్రలేఖ" సినిమా పత్రిక ఎడిటర్, ప్రొప్రయిటర్, రిపోర్టర్, అన్నీ అయిన మూర్తి వచ్చాడు. అతనికి సుబ్బారావంటే చాలా ఇష్టం. అందరి సినిమావాళ్ళలా గాకుండా, పత్రికల వాళ్ళతో మనసిచ్చి మాట్లాడుతాడు. క్రొత్త వాళ్ళతో సినిమా తీసే పథకానికి అసలు ప్రోత్సహించింది మూర్తే.

"ఏమిటి అలా దిగులుగా వున్నారు?" అడిగాడు మూర్తి.

మాధవి రాకపోవడం, షూటింగు ఆగిపోవడం, వెతికినా కనుపించక పోవడం గురించి వివరంగా చెప్పాడు మూర్తికి సుబ్బారావు. "ఇప్పుడామె నాకు కనుపించకుండా పోతే దాదాపు యాభై వేలు నష్టమొస్తాయి. ఆమెతో ఇంత దాకా షూట్ చేసిన అరు రీళ్లు కట్టవుతాయి. నా ఆర్థిక పరిస్థితి మీకు తెలుసు!" అన్నాడు విచారంగా.

మూర్తికి అర్థం కాలేదు. ఉన్నట్టుండి ఆమె ఎలా అంతర్థానమైందో ఊహించ లేక పోయాడు.

"ఆమె దేవూరిదో ఏమిటో చెప్పిందా?" అడిగాడు మూర్తి.

"లేదు. ప్రస్తుతం ఈ వూరేనంది. తనకు ఎవరూ లేరంది."

"ఇంతకుముందు ఏం చేసేదట!"

"హైద్రాబాద్‌లో క్లబ్‌లో డాన్సు చేస్తుండేదట. ఆ పనిమీద విసుగొచ్చి ఇలా వచ్చేసిందట."

"మీ అడ్వర్టయిజ్‌మెంటు చూసేనా వచ్చింది!" అడిగాడు మూర్తి.

"అవును" అన్నాడు సుబ్బారావు.

మూర్తి ఆలోచించాడు. మాధవితో అతను మాట్లాడాడు. ఆమెకు సినిమా తారగా జీవించడం ఆనందంగానే వున్నట్లు వ్యక్తపరచింది. అందరిలా కాకుండా, జీవితాన్ని పవిత్రంగా, అపనిందలకు దూరంగా వుంచుకోవాలనుకుంటున్నట్లు వెల్లడించింది మాటల సందర్భంలో. మాధవి రూపలావణ్యాలు అపూర్వం అనిపించాయి చూడగానే. నలిగీ నలగని గులాబీలాగా, మనోహరంగా వుందామె సౌందర్యం అనుకున్నాడు మూర్తి.

మాధవి ఫోటోలు వేసి, ఆమె అందచందాల గురించి, నటనాకౌశలాన్ని గురించి చిత్రలేఖలో ఆర్టికల్సు రాశాడు

మూర్తి. ఎంతోమంది మెచ్చుకుంటూ, ఆమెకు బంగారు భవిష్యత్తు వుందని ఎంకరేజ్ చేస్తూ ఉత్తరాలు రాశారు కూడా.

"ఏమిటి మూర్తీ ఆలోచిస్తున్నావు?"

"మాధవి చాలా మంచిపిల్ల. పనిచేసిన వారం రోజులూ కష్టపడి పనిచేసింది. టైముకు సెట్‌కు వచ్చింది. అలాంటిది చెప్పా పెట్టకుండా ఎటు వెళ్ళింది. ఎందుకు వెళ్ళింది. ఆమెకే ఆమె ఏదైనా అర్జంటు పనిమీద వెళ్ళవలసి వుంటే మీకు చెప్పకుండా వెళ్తుందని నాకు అనిపించడం లేదు."

"అయితే ఆమెను బలవంతంగా లాక్కుపోయారా?" అడిగాడు సుబ్బారావు.

"అదీ చెప్పలేకుండా వున్నాను."

"ఆమేం చిన్నపిల్లకాదు. ఎవరైనా అలా చేసివుంటే అల్లరిచేసి వుండొచ్చుగా."

"మనం ముందుగానే నిర్ణయానికి రావడం మంచిది కాదు. మరో రోజు చూద్దాం. తిరిగొస్తే సరే! లేకుంటే ఏంచెయ్యాలో నిర్ణయించుకుందాం. మీరుమాత్రం కంగారు పడకండి. ఎవ్వరికీ ఈ విషయాలు చెప్పకండి" అన్నాడు మూర్తి.

"అలాగే! నన్ను నువ్వే కాపాడాలి" అన్నాడు సుబ్బారావు బెంబేలుపడుతూ. మూర్తి ధైర్యం చెప్పి వెళ్ళిపోయాడు.

2

సుబ్బారావుకు తెల్లవారిందాకా నిద్రపట్టలేదు. తీస్తున్న సినిమా మధ్యలోనే ఆగిపోయినందుకు అతనికి విపరీతమైన బాధగా వుంది. ఉన్న కాస్త ఆస్తి తెగనమ్మి రంగంలోకి

దూకిన మనిషి కావడంవల్ల సహజంగానే భయంతో దిగాడు. మధ్యలో అనుకోని అవాంతరం అడ్డొచ్చేసరికి మరింత పిరికితనం ఆవహించింది.

భళ్ళున తెల్లారింది. ఎనిమిదింటికి డైరక్టరు, కెమెరామెన్ వచ్చారు. మాధవి గురించి అడిగారు. ఏమీ తెలీదని చెప్పాడు. ఆ రోజంతా చూసి ఆమె వచ్చే సూచనలు లేకుంటే స్టూడియోకు ఫోన్ చేసి సెట్ తీసెయ్యమని చెప్పడం మంచిదన్న ఉచిత సలహా పడేసి, రెండు కాఫీలు త్రాగి, రెండు సిగరెట్లు తగలబెట్టి వెళ్ళిపోయారు.

సుబ్బారావుకు మతిపోయినట్లయింది.

పన్నెండింటికి మూర్తి మళ్ళా వచ్చాడు.

సుబ్బారావును చూడగానే పరిస్థితిలో ఏ విధమైన మార్పు లేదన్న విషయం అర్థమైంది.

"అయితే ఆమె అంతర్థానమైనట్లేగా?" అడిగాడు మూర్తి కూర్చుంటూ.

"అలాగే అనుకోవాలి!" అన్నాడు సుబ్బారావు.

"ఏంచేద్దాం?"

"ఎలాగైనా వెతికి పట్టుకోవాలి. లేకుంటే మునిగిపోతాను."

"ఈ పని మనకి మనం సాధించలేం. పోలీసు రిపోర్టు ఇద్దామా?"

"వద్దు! లేనిపోని అల్లరవుతుంది. డబ్బిచ్చిన డిస్ట్రిబ్యూటర్లు ప్రాణాలు తోడుతారు. అందరి నోళ్ళల్లో పడ్డామంటే ఎగతాళి చేస్తారు. అల్లరికాకుండా ఆమెను పట్టుకొచ్చి మళ్ళా పని ప్రారంభం చెయ్యాలి. అప్పుడే మన పరువు దక్కుతుంది" అన్నాడు సుబ్బారావు.

"కథ కాస్త మార్చి ఆమె క్యారెక్టరును చంపినట్లు రెండు డూప్ షాట్స్ దీసి పూర్తిచేసేందుకు వీలులేదా?"

"అబ్బే! కథంతా ఆమె చుట్టూ తిరుగుతుంది. అసలామె హీరోని చంపాలి. ఆమెను చంపేకన్నా మనం చావడం ఉత్తమం."

మూర్తి ఆలోచనలో పడ్డాడు. రెండు నిముషాలు మాటపలుకూ లేకుండా కూర్చున్నాడు.

"అయితే ఒక పని చేద్దాం!" అన్నాడు.

ఏమిటన్నట్లు చూశాడు సుబ్బారావు.

"ప్రఖ్యాత ప్రైవేట్ డిటెక్టివ్ సుధాకర్ గారు తెలుసా మీకు. పెద్ద పెద్ద కేసుల్ని పరిశోధించిన ప్రజ్ఞాశాలి. ఆయనకిది పెద్ద విషయంగా వుండదు. ఆయన్ని నియమిద్దాం. అల్లరిలేకుండా పని తెమిలిపోతుంది. అయితే కాస్త ఫీజు ఎక్కువ తీసుకుంటాడు" అన్నాడు మూర్తి.

"అంటే ఏమాత్రం."

"ఖర్చులన్నీ మనం భరించాలి. కనీసం ఐదువేలన్నా ఇవ్వాలి."

"అయితే వెళ్దాం పదండి" అన్నాడు సుబ్బారావు.

అరగంట తర్వాత ఇద్దరూ కారెక్కారు. అంబాసిడర్ కారు అడయారులోని సుధాకర్ బంగాళాముందు ఆగింది. ఆయన ఆఫీసు, ఇల్లు అక్కడే వున్నాయి. కారు పోర్టికోలో ఆపి, దిగి లోనికి వెళ్ళారు.

హాల్లో మూలగా చిన్న బల్లపైన టైప్ మిషన్ వుంది. దాని ప్రక్కనున్న స్టూల్ మీద టెలిఫోన్ వుంది. బల్లకివతలివేపు రెండు ఫోల్డింగ్ కుర్చీలున్నాయి. ఇద్దరూ వెళ్ళి కూర్చున్నారు.

ప్రక్కనున్న స్వింగ్ డోర్స్ తెరచుకొని అందమైన అమ్మాయి చేతిలో షార్ట్ హాండ్ బుక్ పట్టుకొని వచ్చింది.

"గుడ్ మార్నింగ్ మిస్..." అంటూ ఆగాడు మూర్తి.

"వసంత!" అంటూ కూర్చుంది.

"నేను! 'చిత్రలేఖ' సినిమా పత్రిక ఎడిటర్‌ను. వీరు ప్రగతీ పిక్చర్సు ప్రొడ్యూసర్ గారు. నాపేరు మూర్తి. వారిపేరు సుబ్బారావు. మాకో కేసులో సుధాకర్ గారి సాయం కావలసి వచ్చాం!" అన్నాడు మూర్తి.

"ఏం కేసు?" అడిగింది వసంత టైప్ మిషన్‌లో పేపరు లోడ్ చేస్తూ.

"అందమైన అమ్మాయి అంతర్ధానమై పోయింది. ఆమె ఆచూకీ తెలుసుకోవాలి!" అన్నాడు మూర్తి.

"అలాంటి కేసుల్లో సామాన్యంగా పోలీసులను వాడుకోమని సలహా ఇస్తుంటారు సుధాకర్ గారు. ఆ ప్రయత్నం ఎందుకు చెయ్యకూడదు."

"ఆ వివరాలు వారికి వివరంగా చెపుతాను. అంతా వింటే వారలా అనరు" అన్నాడు మూర్తి.

"ఆల్ రైట్!" అంటూ ఫోన్ తీసి బజ్జర్ నొక్కి తన బాస్‌తో టూకీగా మూర్తి, సుబ్బారావుల గురించి చెప్పింది. వాళ్ళను తీసుకుని వసంతను కూడా లోనికి రమ్మన్నాడు సుధాకర్.

"రండి! వెళ్దాం!" అంటూ లేచింది వసంత.

మూర్తీ, సుబ్బారావు ఆమెను అనుసరించారు.

విశాలమైన ఏ. సి. గది మధ్యలో పెద్ద గ్రాడెజ్ టేబుల్ వెనుక కూర్చుని వున్నాడు సుధాకర్ రివాల్వింగ్ చెయిర్‌లో. వెనుక వేపు గోడకు అమర్చిన బీరువాలనిండా రకరకాల పుస్తకాలు వున్నాయి. గ్రేకలర్ సూట్ లోదుస్తుకుని వున్నాడు. కట్టుకున్న ఎర్రపూల టై రెపరెపలాడుతూంది సన్నటి గాలి అలకు.

"కూర్చోండి!" అన్నాడు సుధాకర్.

అంతా ఆయన ముందు కూర్చున్నారు.

మూర్తి వివరంగా చెప్పాడు విషయం. సుబ్బారావు

తలాడిస్తూ కూర్చున్నాడు. వసంత పెన్సిల్ షార్ట్‌హాండ్ బుక్ పైన కదులుతూనే వుంది.

"ఆమె పుట్టుపూర్వోత్తరాలు మీకు తెలీవా!" అడిగాడు సుధాకర్.

"తెలుసుకుందామని అడిగినా చెప్పలేదు!"

"మీ పిక్చరులో వేషం వేసినందుకు పారితోషికంగా ఎంతిస్తామన్నారు?"

"ఐదు వేలు!"

"ఏమైనా ఇచ్చారా?"

"వెయ్యి రూపాయలివ్వబోయాను. ఐదొందలు తీసుకుంది. మిగిలింది సినిమా పూర్తయ్యాక ఇమ్మంది."

"మిమ్మల్ని కలిసేనాటికి ఈ వూరొచ్చి ఎన్నాళ్ళయిందో తెలుసా ఆమె?"

"అంతకు రెండు దినాలముందే వచ్చానంది. చిత్రలేఖలో నేను వేసిన అడ్వర్టయిజ్‌మెంటు చూసి వచ్చిందట."

"మిమ్మల్ని కలసిన రోజు గుర్తు తెచ్చుకోండి. ఆమె బట్టలు ఎలా వున్నాయి. మేకప్ ఎలా వుంది. డబ్బుకు ఇబ్బంది పడుతున్నట్లు అనిపించిందా?"

"లేదండీ! చాలా ఖరీదయిన చీర కట్టుకుంది. చేతికి రెండు వెడల్పాటి బంగారు గాజులున్నాయి. టాక్సీవాడికి వందరూపాయల నోటిచ్చింది. వాడు చిల్లరలేదన్నాడు. ఆ తర్వాత నేనిచ్చి పంపాను వాడ్ని!"

"ఆమె ఫోటోలు మీ దగ్గర వుండాలి. కొన్ని ప్రింట్లు పంపండి. ప్రయత్నిస్తాను" అన్నాడు సుధాకర్.

"మీ ఫీజు!" అంటూ ఆగాడు సుబ్బారావు.

"అంతా ఆఖరులో చూసుకుందాం. దాన్ని గురించి మీరు కంగారు పడకండి" అన్నాడు సుధాకర్.

"సరే!" అంటూ ఇద్దరూ లేచి శెలవు పుచ్చుకున్నారు.

3

"అన్ని పత్రికలు చూశావా?" అడిగాడు సుధాకర్.

"ఇంగ్లీషు, తెలుగు, తమిళం అన్నీ క్షుణ్ణంగా వెతికాను. ఎక్కడా ఆత్మహత్యలు చేసుకొన్న కేసులుగానీ, ఆక్సిడెంటులో చనిపోయిన మనుషుల వివరాలుగానీ లేవు" అంది వసంత.

"నాయర్ భార్యకు ఫోన్ చేసి చెప్పావుగా. అడిగి చూడు అతనేమన్నా చెప్తాడేమో?" అన్నాడు. వసంత లేచివెళ్ళి ఫోన్ చేసింది కమీషనర్ ఆఫ్ పోలీస్ నాయర్‌కు. నాయర్ లైన్లో రాగానే రిసీవరు అందించింది. సుధాకర్, నాయర్ ప్రాణస్నేహితులు.

"వసంత చెప్పిందాన్ని గురించి వాకబు చేయించావా?" అడిగాడు సుధాకర్.

"ఆఁ! ఏ ఆడపిల్లా, అందులోనూ అందమైన ఆడపిల్ల, కారు, లారీలాంటి దాని క్రిందపడి చచ్చినట్లు మాకు రిపోర్టు రాలేదు. అయినా నీకెందు కవసరమయింది ఈ సమాచారం" అడిగాడు నాయర్.

"నాకో కేసు వచ్చింది."

"అది మా దగ్గరకు రాలేదా?"

"లేదు. ఇప్పట్లో రాదుగూడా" అన్నాడు సుధాకర్.

"రాలేదన్న చింత నాకేంలేదు! అయితే కొద్దిరోజులు తమరు బిజీగా వుంటారన్నమాట" అన్నాడు నాయర్.

"అనేగా! థాంక్స్! అవసరమయితే మళ్ళీ ఫోన్ చేస్తాను" అంటూ ఫోన్ రిసీవరు వసంత కందించాడు. ఆమె దాన్ని క్రేడిల్ పైన పడేసింది.

"కూర్చో!" అన్నాడు వసంతను సుధాకర్.

ఆమె ఎదురుగా కూర్చుంది.

"నీ అభిప్రాయమేమిటి?" అడిగాడు సుధాకర్.

"దేన్ని గురించి?"

"మనం ఒప్పుకున్న కేసు గురించి."

"ఆమె సినిమాల్లో వేషం వేద్దామని వచ్చింది. అందంగా వుంటుందని వాళ్ళమాటల ద్వారా విన్నాను. ఎవరైనా డబ్బుగల మనిషి నెలకు పెద్ద మొత్తం ఇచ్చే పద్ధతిమీద ఉంపుడుకత్తెగా వుండమని అడిగి వుంటాడు. ఆమెకది నచ్చి వుంటుంది. అతనెక్కడో ఆమెను పెట్టి వుంటాడు" అంది వసంత.

"ఆమె ఈ వూళ్ళోనే వుండి, క్షేమంగా వుంటే, షూటింగుకు ఎందుకు రాలేదు. ఒకవేళ నువ్వు చెప్పిన ఛాన్సు తగిలినా, తన్ను నమ్ముకొన్న సుబ్బారావుకు అన్యాయంచేసి పోతుందా?!"

"సినిమాల్లో వేషాలు వెయ్యగూడదని అతను ఆంక్షు పెట్టాడేమో?"

'అలా జరగదు. అతనికి కూడా ఆమె సినిమా తార గావడం ఇష్టగానే వుంటుంది. ఎందుకంటే ఫలాని తారను వుంచుకున్న మనిషంటే సంఘంలో పెద్ద విలువనుకొనే మనుషులున్నారు" అన్నాడు సుధాకర్.

"మీ అనుమానం ఏమిటి?"

"ఆమె ఉన్నట్టుండి ఇక్కడికి వూడిపడింది. అంతకు ముందు హైద్రాబాద్‌లో ఏదో క్లబ్బులో డాన్సు చేసే దాన్నని చెప్పింది. అక్కడేమన్నా జరిగివుండి, అది ఆమెకు భయకారణమయి వుంటే, ఇక్కడికి పరుగెత్తుకొచ్చిందేమో?" అన్నాడు.

"అటువంటి మనిషి వీలైనంతవరకు పదిమంది దృష్టిలో పడకుండా ఎక్కడైనా రహస్యంగా, అనామకంగా

వుండిపోవాలనుకుంటుంది తప్ప, సినిమాల్లో వేషాలువేసి అనవసరంగా, తన ఉనికిని అందరికీ సులభంగా తెలిసి పోయేలా చేసుకుంటుందా?'' అడిగింది వసంత.

సుధాకర్‌కు వసంతంటే ప్రేమేకాదు అభిమానం, గౌరవం కూడా వున్నాయి. కష్టపడి పనిచెయ్యడం, అపాయాలు ఎదురొచ్చినా లెఖ చెయ్యకపోవడం, మాత్రమే గాకుండా ప్రతి విషయాన్ని ఎంతో నిశితంగా పరీక్షించి చర్చిస్తుంది. చాలాసార్లు ఆమె ఊహలే రైటయినాయి.

''అయితే ఆమె తన గతం గురించి ఎందుకు చెప్పలేదు. ఉన్నట్టుండి ఎందుకు మాయమైంది?'' అడిగాడు సుధాకర్.

''అది తెలుసుకోవడం మీ పని. అందుకే వాళ్ళు మిమ్మల్ని పెట్టుకుంది!''

''నన్ను మాత్రమే కాదు! నిన్నుగూడా'' అన్నాడు సుధాకర్.

వసంత నవ్వింది.

''ముందు నువ్వు వెళ్ళి మాధవి వుంటూండిన గది చుట్టు ప్రక్కల వాళ్ళను వాకబు చెయ్యి. మద్రాసులో దిగాక ఆమె తిన్నగా అక్కడికే వచ్చి వాలిందా లేక మరెక్కడన్నా వుంటుంటే, ఫలానిచోట గది ఖాళీగా వుందని తెలిసి వచ్చిందా? మొదలైన వివరాలు తెలుసుకుని రా! ఆ తర్వాతఏంచెయ్యాలో ఆలోచిద్దాం!''అన్నాడు సుధాకర్.

''అలాగే బాస్!'' అంటూ లేచి వెళ్ళింది.

ఆ తర్వాత పదినిముషాలకు సాదా చీర, జాకెట్‌తో మామూలు స్త్రీలా తయారయివచ్చి సుధాకర్ దగ్గర శెలవు పుచ్చుకొని, టాక్సీ ఎక్కి కోడంబాకం పోనిమ్మంది. ఓవర్ బ్రిడ్జి దాటి కొంతదూరం పోయాక ఆపి, దిగేసి, డబ్బులిచ్చింది. టాక్సీ వెళ్ళాక ప్రక్కదారంట నడుచుకుంటూ రంగరాజపురం కొబ్బరితోటలో చెల్లాచెదురుగా

పిచ్చిక గూళ్ళల్లా కట్టుకున్న కొబ్బరి ఆకుల గుడిసెల్లో జొరబడింది.

వెతుక్కుంటూ వెళ్ళి పెద్ద గుడిసె ముందాగింది. అందులో ఆరు గదు లున్నాయి. అరింట్లోనూ కాపురా లున్నాయి. దాని యజమానురాలు వెంకాయమ్మని వాకబు చేసి తెలుసుకుంది.

ట్రంకుపెట్టి పైన కూర్చుని .విజయచిత్ర బొమ్మలు చూస్తూంది వెంకాయమ్మ. దాదాపు యాభయి సంవత్సరా లుంటాయి ఆమెకు.

"మాధవీ! మాధవీ!" పిలిచింది వసంత.

"ఎవరది?" అంటూ లేచొచ్చింది వెంకాయమ్మ. వసంతను చూసి ఎవరయిందీ అర్థంగాక "ఎవరికోసం?" అడిగింది.

"మా మాధవి ఇక్కడే కదండీ వుండటం?" అడిగింది వెంకాయమ్మను.

"అవునమ్మా! వారం రోజులనాడు అద్దెకు దిగింది. నిన్నటి నుండి రాలేదు గదికి. ఆమెకు వేషం ఇచ్చిన కంపెనీవాళ్ళు తిరిగి పోతున్నారు" అంది వెంకాయమ్మ.

"నిన్న నాకు ఫోన్ చేసి అడ్రసు చెప్పి ఈ దినం రమ్మంది. మా ఇద్దరిదీ ఒక ఊరే! నే లేకున్నా వెంకా యమ్మగారినడిగి తాళం తీసుకొని గదిలో వుండు వస్తాను అని కూడా చెప్పింది నాకు" అంది వసంత.

"ఐతే వస్తుందేమోలే! తాళం ఇచ్చేదా?" అడిగింది.

"ఇవ్వండి!" అంది వసంత.

వెంకాయమ్మ బొడ్లోనుంచి తాళంచెవి తీసి ఇచ్చింది. మాధవి వాటా చూపించింది. వసంత తాళం తెరచి లోనికి వెళ్ళింది. గదిలో ఏవీ పెద్ద సామాన్లు లేవు. సూట్ కేస్ మాత్రం వుంది. తలుపును మూసి దాన్ని తెరచింది. ఖరీదైన

చీరలు నాలుగున్నాయి. వాటికి మాచ్ అయ్యే బ్లౌజ్‌లు, బ్రాసరీలు, పెట్టీకోట్స్ వున్నాయి. కాటన్ గౌన్ ఒకటి వుంది. క్రిందున్న న్యూస్ పేపరు క్రింద ఒక ఫోటో కనిపించింది. దాన్ని తీసుకొని చూసింది.

అందమైన అబ్బాయి ఫోటో అది. సూట్ వేసుకొని తీయించుకున్న బస్ట్ ఫోటో అది. వెనుకవైపు త్రిప్పి చూసింది. రామా స్టుడియో, లకిడీకా-పూల్-హైద్రాబాదు అన్న రబ్బరుస్టాంపు కనుపించింది. విత్ లౌ టు రోజా అని నల్లటి బాల్‌పాయింట్ పెన్‌తో రాసి క్రింద గజిబిజిగా చేసిన సంతకం కనుపించింది. ఆ ఫోటో తీసి హాండ్‌బాగ్‌లో వేసుకుంది. సూట్‌కేస్ సర్ది యథాస్థానంలో పడేసి కూర్చుంది.

వెంకాయమ్మ తిరిగొచ్చింది.

"మాధవి రాలేదా?" అడిగింది.

"లేదండీ!" అంది వసంత.

"నేను బెజవాడ నుంచి వస్తూంటే రైల్లో కలిసింది మాధవి. మద్రాసులో నువ్వున్నట్లు ఆమెకు గుర్తులేదా?" అడిగింది వెంకాయమ్మ గుమ్మంపైనే కూర్చుంటూ.

"నా గురించి చెప్పలేదా?"

"తెలిసినవాళ్లెవరూ లేరంది. సినిమాలో చేరడానికి వస్తున్నానని చెప్పింది. ఎక్కడైనా వుండేందుకు వసతి చూపించమంది. నావెంట తీసుకొచ్చాను. ఆపిల్ల అదృష్టం బావుంది. రత్నకుమారి ఒక్కన హీరోయిన్ ఛాన్సు తగిలింది" అంది వెంకాయమ్మ.

"అలాగా! ఇంట్లో చెప్పకుండా వచ్చేసిందట. అందుకని నా దగ్గరకు రాలేదు. ఎవరికన్నా తెలిస్తే వచ్చి లాక్కెళ్తారని భయపడి వుంటుంది. ఆ భయం పోయాక నాకు ఫోన్ చేసింది" అంది వసంత.

"బాగా డబ్బున్న వాళ్ళ లాగున్నారు!" గొణిగింది.

"అవును_వాళ్ళకు చాలా ఆస్తి వుంది."

"వంద రూపాయల నోట్లు చాలా వున్నాయి ఆమె పర్సులో. ఖర్చు కూడా విపరీతంగా చేయడం గమనించాను" అంది వెంకాయమ్మ.

అలా మాట్లాడుతూనే చాలా విషయాలు రాబట్టింది. మూడు గంటలు గడిచిపోయాయి.

"ఇంకా రాలేదే! ఇవాళింక రాదేమో? నేను మళ్ళీ వస్తాను. అదో స్నేహితురాలు వచ్చి చాలాసేపు చూసి వెళ్ళిందని చెప్పండి!" అంటూ వెలుపలికొచ్చి, ఆమెదగ్గర శెలవు పుచ్చుకొంది.

మళ్ళీ నడచి కోడంబాకం బ్రిడ్జిదాకా వచ్చి, టాక్సీ ఎక్కి అడయారు పోనిమ్మంది. బంగళాలోకి వెళ్ళగానే చూసింది పోర్టికోలో బాస్ కారు కనుపించలేదు. ఎటో వెళ్ళి వుంటుందనుకొంది. టైప్ రైటర్ ముందు కూర్చుని తను సేకరించిన సమాచారం విపులంగా టైప్ చేసింది. దానికి తను తెచ్చిన ఫోటో పిన్ చేసి పాడ్ లో వుంచుకుంది.

సుధాకర్ లోనికొచ్చాడు.

"హల్లో! వచ్చేశావా?" అన్నాడు గదిలోకి వెళ్తూ.

వసంత తను తయారుచేసిన రిపోర్టు తీసుకుని వెంట వెళ్ళి ఎదురుగా కూర్చుని, అతని ముందు తోసింది.

సుధాకర్ చకచక చదివి, వెనుకనున్న ఫోటోను పరిశీలనగా చూశాడు.

"గుడ్! చాలా సమాచారం సేకరించావ్. నేనుకూడా కొంత సమాచారం తోడాను" అన్నాడు.

చెప్పమన్నట్లు చూసింది వసంత.

"మొన్న సాయంత్రం షూటింగు కాగానే మాధవి

స్టూడియో వెలుపలున్న టాక్సీ ఎక్కి కాంటినెంటల్ హోటల్ కు పోనిమ్మంది. టాక్సీవాలా ఆమెను అక్కడ దించాడు."

"తర్వాత..."

"అతను సవారీకోసం ఎదురుచూస్తూ హోటల్ ముందే నిలబడ్డాడట. అరగంట తర్వాత ఇంపోర్టెడ్ ఇంపాలా కార్లో ఆమె ఒక అందమైన యువకుడి ప్రక్కన కూర్చుని అతని మీదుగా వెళ్ళిపోయిందట" అన్నాడు సుధాకర్.

"ఆ తర్వాత..."

"నేను హోటల్ లో దూరాను. బేరర్లనూ, రిసెప్షనిస్టునూ, క్రాస్ ఎగ్జామ్ చేశాను. మాధవి ఫోటో చూపించాను. ఎవ్వరూ చూడలేదన్నారు. ఇంపాలా కారు గురించి అడిగాను. హోటల్ లో నిన్న దాదాపు అర డజనుదాకా వున్నాయట. అవి ఎవరివయిందీ వాళ్ళకు తెలీదట. కార్లదగ్గర కాపలా వుండే బాయ్ ని అడిగాను. ప్రతి కార్లోనూ అందమైన జంటలే దిగారనీ, తిరిగి వెళ్లారనీ చెప్పాడు. నా పరిశోధన అక్కడ ఆగిపోయింది" అన్నాడు సుధాకర్.

"అయితే ఇప్పుడు మనం ఏం చెయ్యాలి?" అడిగింది వసంత.

"హైద్రాబాద్ వెళ్దాం! అక్కడేమన్నా సమాచారం దొరుకుతుందేమో చూద్దాం!" అన్నాడు సుధాకర్.

"ఓ. కే" అంది వసంత.

ఆ రాత్రి ఫ్లైట్ లో హైద్రాబాద్ చేరుకున్నారు.

4

వసంతను, హైద్రాబాద్ లో వున్న క్లబ్బులు, పెద్ద హోటల్స్ తిరిగి ఎవరికయినా మాధవిని చూసిన గుర్తుం

దేమో తెలుసుకోమన్నాడు. తను రామా స్టుడియోకెళ్ళి ఆ ఫోటోలోని వ్యక్తి ఎవరో తెలుసుకుందామనుకున్నాడు.

వసంత వెళ్ళిపోయింది. వెంట కొన్ని మాధవి ఫోటోలు తీసుకెళ్ళింది.

సుధాకర్ టాక్సీలో లకిడికా-పూల్ చేరుకున్నాడు. వెతుక్కుంటూ వెళ్ళి రామా స్టుడియోలో అడుగు బెట్టాడు.

ప్రొప్రయిటర్ మంగళూరు బీడీ కాలుస్తూ అకౌంటు పుస్తకం ముందేసుకుని కూర్చున్నాడు. సుధాకర్ వెళ్ళి అతనికెదురుగా వున్న కుర్చీలో జేరబడ్డాడు.

"ఫోటో తీయించుకుంటారా?" అడిగాడతను బీడీ అవతలకు పారేస్తూ.

వద్దన్నట్లు తలూపాడు అడ్డంగా సుధాకర్.

"నాతో పనుందా?" అడిగాడు.

"ఆఁ!"

"చెప్పండి!" అన్నాడు.

"నేను మద్రాసులో మాలాపిక్చర్సు పేరిట సినిమా తీస్తున్నాను. క్రొత్తవాళ్లు కావాలని పేపర్లో ప్రకటించాను. చాలామంది ఉత్తరాలు రాసి ఫోటోలు పంపారు. మా ఆఫీసులో, పొరపాటుగా ఉత్తరాలు, ఫోటోలూ విడిపోయాయి. వాటిల్లో అందమైన ఫోటో దొరికింది. అడ్రసు పోయింది. కానీ దానివెనుక ఆ ఫోటో ఎక్కడ తీసిందీ రబ్బరుస్టాంపు వేసివుంది. అందుకే వచ్చాను" అన్నాడు సుధాకర్.

"మా స్టూడియోదా?" అడిగాడు అతను.

"అవును" అంటూ ఫోటో తీసి పెట్టాడు బల్లమీద.

అతను దాన్నందుకుని చూశాడు. చూసిన వెంటనే ఉలిక్కిపడటం గమనించాడు సుధాకర్. వెనక్కి తిప్పి,

చూశాడు. రబ్బరు స్టాంపు చూసి దానిపైన రాసి వుంది కూడా లోలోపలే చదువుకొని, ఫోటో తిరిగి టేబుల్ పైన పడేశాడు.

"నాకతని అడ్రసు కావాలి!" అన్నాడు సుధాకర్.

"తీసింది నేనే! కానీ అతనెవరో నాకు తెలీదు. కార్లో వచ్చాడు. ఫోటో తీయించుకున్నాడు. నాలుగు కాపీలతోపాటు నెగటివ్ కూడా డబ్బిచ్చి తీసుకొన్నాడు. బిల్ కూడా అవసరం లేదన్నాడు. అందువల్లే నాకు బాగా గుర్తుంది" అన్నాడు.

"ఐ. సీ. బాగా ఆలోచించండి. అతనిదీవూరే అయి వుండాలి. అతనికి రాబోయే మంచి అవకాశం అనవసరంగా పోతూంది. అతని అడ్రసు చెప్పగలిగితే, అతన్ని కలుసుకుని మా పిక్చరులో వేషం ఇస్తారని చెప్పానంటే ఎగిరి గంతేసి, మీరు చేసిన సహాయానికి తగిన ప్రతిఫలం ఇస్తాడు. గుర్తు తెచ్చుకునేందుకు ప్రయత్నించండి" అన్నాడు సుధాకర్.

"సారీ! నాకు అడ్రసులతో అవసరం ఎప్పుడూ వుండదు. వాళ్ళకై వాళ్లు చెప్తే తప్ప మరెవ్వర్నీ అడగను" అన్నాడతను.

"అయితే మీవల్ల నాకు సాయం లభించదంటారా?" అడిగాడు సుధాకర్ లేస్తూ.

"క్షమించండి! నేనీ విషయంలో నిస్సహాయుణ్ణి" అన్నాడు అతను.

సుధాకర్ దిగి రోడ్లోకొచ్చి నిలుచున్నాడు.

అంగట్లోనుండి అతను గబగబ వచ్చి "చూడండీ! ఒకవేళ నేను అతన్ని మళ్ళీ చూస్తే మీ గురించి చెప్పగలను. మీ రిక్కడే వుంటారా? లేక మద్రాసు కెళ్ళిపోతారా?" అడిగాడు. సుధాకర్ అతని వంక విస్తుపోతూ చూశాడు.

"రెండ్రోజులుంటాను."

"మీ అడ్రసు చెప్పండి. గుర్తొచ్చినా, లేక అతను కను పించినా మీకు తెలియపరుస్తాను," అన్నాడు అతను.

"హోటల్ బ్లూ మూన్ రూం నెంబరు అన్రొందలా ఆరు. విశ్వనాథ్ అని అడగండి" అన్నాడు సుధాకర్.

"అలాగే!" చెప్పాడు అతను వెళ్ళిపోతూ.

సుధాకర్ తిన్నగా హోటల్ కు చేరుకున్నాడు. వసంత రాత్రి ఒంటిగంటకు వచ్చింది.

"ఏమయినా తెలిసిందా?" అడిగాడు సుధాకర్.

"ఆc! చాలా తెలిసింది?" అంది కూర్చుంటూ.

"చెప్పు!" అన్నాడు ఉత్సాహంగా.

"ఈగల్ బార్ అండ్ రెస్టారెంటులో మాధవి కాబరే డాన్సర్ గా పనిచేసిందట. ఆమె వెళ్ళిపోయి నెలపైగా అయిందని సర్వర్ చెప్పాడు. కాని ఆమె పేరు మాధవి కాదని రోజాని చెప్పాడు" అంది వసంత.

"ఇంకా ఏం తెలుసుకున్నావ్?"

"నాకు ఈ విషయాలు చెప్పిన సర్వర్ ఇంటి అడ్రసు సంపాదించుకొచ్చాను. అతను పగటిపూట ఇంట్లోనే వుంటాడట. మనం ఒకమారు వెళ్ళి కలుసుకుంటే సంగ తులు ఇంకా ఎక్కువ తెలుస్తాయనుకుంటాను" అంది వసంత.

"గుడ్! తిన్నగా ఈగల్ బార్ కి వెళ్ళావా లేక మరే దైనా క్లబ్ కు వెళ్ళావా?"

"లేదు. అది ఐదోది. మిగిలిన నాలుగు చోట్ల నాకేం సమాచారం తెలీలేదు. కానీ నాలుగో హోటల్ లో సర్వర్ ఈగల్ బార్ లో చూడమన్నాడు" అంది వసంత.

"నువ్వు మాధవి సారీ రోజాను గురించి ఎందుకు వాకబు చేస్తున్నదీ అతను అడిగాడా?"

"ఆఁ! మా చెల్లెలని చెప్పాను" అంది వసంత.

"నా మీద నువ్వే నయం. నేను వెళ్ళినచోట సమాచారం రవంతకూడా దొరకలేదు. కానీ నా అనుమానం నిజమైతే, మనమీద త్వరలోనే దాడి జరుగుతుందని పిస్తుంది" అన్నాడు సుధాకర్.

"అయితే మనం జాగ్రత్తగా వుండాలంటారు?"

"ఆఁ! ఎక్కువ జాగ్రత్తగా వుండాలి!" అన్నాడు సుధాకర్.

ఇద్దరూ చెరో మంచంపైన పడుకున్నారు. తిరిగి తిరిగి వుండటంవల్ల వెంటనే నిద్రపట్టేసింది.

సుధాకర్ మళ్ళీ కళ్ళు తెరచేసరికి కిటికీలోంచి సూర్యకిరణాలు మంచంమీద పడుతున్నాయి. లేచి కూర్చుని ఒళ్ళు విరచుకున్నాడు. ఎదురుగా టీపాయిపైన రెండు చిన్న ఫ్లాస్కులు కనుపించాయి. మూత తీసి చూశాడు. కాఫీ పొగలు కక్కుతోంది.

ఆర్డరివ్వకుండానే కాఫీ ఎవరు తెచ్చి పెట్టారో అర్థంకాలేదు. వెళ్ళి తలుపులు తీసి పరీక్షగా చూశాడు. గాడ్రెజ్ తాళం ఏల్ టైపుది వుంది. అంటే తియ్యడం, వెయ్యడం, లోపలా బయటకూడా చెయ్యొచ్చు.

ఫోన్ తీసి రిసెప్షను పిలిచి కాఫీ ఎవరు పంపారని అడిగాడు. అతను మీరే పంపమన్నారుగదండీ అనటంతో అనుమానం ఎక్కువయింది. లేచి సూట్ కేసు తెరచి అందులోంచి ఎర్ర లిట్మస్ పేపరు ముక్కొకటి త్రుంచి ఫ్లాస్కు మూత తీసి వేశాడు. పైకి తేలి నీలంగా మారిపోయింది. అంటే అందులో ఏదో కలిసివుందన్న విషయం అర్థమైంది.

వసంత లేచింది. సుధాకర్ ను చూసి "ఎంతసేపయింది లేచి?" అడిగింది.

"ఇంతకుముందే లేచాను!" చెప్పాడు సుధాకర్.

"కాఫీ తెప్పించారా?" అడిగింది.

"లేదు! మన మిత్రులు మనకోసం విషం కలిపి పంపారు!" అన్నాడు జరిగింది వివరంగా చెప్తూ సుధాకర్.

విని విస్తుపోయింది వసంత.

"పెద్ద ప్రమాదం తప్పింది!" అంది ఊపిరి పీల్చుకుని.

"జరిగిందాన్ని బట్టి మన పరిశోధన సరయిన మార్గంలోనే సాగుతోందనుకోవాలి. మనకు కావలసిన మనుషులే మనల్ని చంపేందుకు ప్రయత్నించారు. అంటే వాళ్ళెవరో ఇక్కడే వున్నారు!" అన్నాడు సుధాకర్.

"మద్రాసుకు ట్రంకాల్ చేసి మాధవి జాడేమైనా తెలిసిందేమో కనుక్కుందామా" అడిగింది వసంత.

సుధాకర్ ట్రంకాల్ బుక్ చేశాడు.

కాలకృత్యాలు తీర్చుకుని వచ్చేసరికి కనెక్షను దొరికింది మద్రాసుతో. మాధవి జాడ తెలీలేదని చెప్పాడు ప్రొఫెసర్ సుబ్బారావు.

ఇద్దరూ డ్రెస్ చేసుకుని క్రిందికొచ్చారు. రెస్టారెంటులోనే టిఫిను తిని కాఫీ త్రాగి వెలుపలికొచ్చి ఆటో రిక్షా ఎక్కారు.

వసంత అడ్రసు చెప్పింది.

ఆటో అడ్డదిడ్డంగా అటూ ఇటూ అరగంట తిరిగి ఒక యింటి ముందాగింది. అక్కడప్పటికే చాలా మంది జనం గుమిగూడి వున్నారు. ఒక పోలీసువాన్ కూడా వుంది దగ్గర్లోనే ఆగి.

సుధాకర్ ఒకతన్ని పిలిచి "ఏమయింది" అని అడిగాడు.

"లక్ష్మయ్యను ఎవరో తుపాకీతో కాల్చి చంపారు" చెప్పాడు.

"అతనే మనకు కావలసిన మనిషి" అంది వసంత.

"అతను ఇంకా వివరాలు చెప్పకుండా నోరుమూసేశారు" అన్నాడు సుధాకర్.

"ఇప్పుడు మనమేం చేద్దాం?" అంది వసంత.

"గుట్టుగా వెళ్ళిపోదాం!" అన్నాడు సుధాకర్.

ఇద్దరూ తిరిగి ఆటో ఎక్కారు.

లకిడీకాపూల్ పోనిమ్మన్నాడు సుధాకర్. ఆటో స్పీడందుకుంది. మళ్ళీ రామా స్టూడియో ముందాపించి దిగి లోనికి వెళ్ళాడు. ఉదయం వేళ కావడంవల్ల జనం ఎవ్వరు లేరు. ప్రొప్రయిటరు మాత్రం కూర్చుని వున్నాడు.

సుధాకర్‌ను చూడగానే లేచి నిలబడి "రండి! రండి!" అన్నాడు.

"ఏమయినా గుర్తొచ్చిందా?" అడిగాడు సుధాకర్.

"లేదండీ!" అన్నాడు అతను.

"మీ పేరు నాకు తెలీదు! నిన్న నేను మీకు చెప్పిందంతా అబద్ధం. నా పేరు సుధాకర్. ప్రైవేట్ డిటెక్టివ్‌ను. ఒక కేసు సందర్భంగా ఇక్కడికొచ్చాను. అది తేలందాకా వెళ్ళను. నేరస్థులతోపాటు వాళ్ళకు సాయంచేసిన వాళ్ళకు కూడా ఇనుపబేడీలు తగిలించాకే వెళ్తాను. ఆ విషయం చెప్పేందుకే వచ్చాను" అన్నాడు సుధాకర్.

అతను కంపించిపోయాడు.

"నా కెందుకండీ చెప్పడం! నాకేం తెలీదు!" అన్నాడతను.

"నీకేం తెలుసో, ఏం తెలీదో నాకు తెలియదనుకోవద్దు. నీకై నువ్వు నిజం చెప్పావంటే ఏ కష్టం రాకుండా చూస్తాను. లేదంటే ఆ ఫలితం నువ్వే అనుభవిస్తావ్!" అన్నాడు సుధాకర్. ఆ తర్వాత అక్కడ క్షణం ఆగ

కుండా వచ్చేశాడు ఆటో వద్దకు. ఎక్కి కూర్చుని హోటల్ కు పోనిమ్మన్నాడు. ఆటో కదలింది. వేగం అందుకుంది.

ఉదయం తనపైన జరిగిన విష ప్రయోగానికి కారకుడీ ఫోటో స్టూడియో వాలాయేనని గట్టి నమ్మకం ఏర్పడింది. తను చూపించిన ఫోటోలోని వ్యక్తి ఎవడో అతనికి తెలిసుండాలి. తను వచ్చి చేసిన ఎంక్వైయిరీ గురించి చెప్పి, తనెక్కడుంటున్నదీ కూడా అతనే చెప్పి వుండాలి. లేకుంటే తన అడ్రసు తెలిసిన మనిషి వేరే ఎవ్వరూ లేరు.

ఆటో హోటల్ కు వచ్చింది. దిగి డబ్బులిచ్చి పంపి రిసెప్షనులోకి వెళ్ళాడు సుధాకర్. వసంత తిన్నగా గదికి వెళ్ళిపోయింది.

ఆ దినం ఉదయం కాఫీ గదికి తెచ్చిన సర్వరును తన వద్దకు పంపమని చెప్పాడు రిసెప్షనిస్టుకు సుధాకర్. అతను అలాగే పంపుతానన్నాడు. కాసేపు టెలిఫోన్ కనెక్షను వంక గమనించి చూశాడు. మనస్సులోనే ఏదో గొణుకున్నాడు. వెలుపలికొచ్చి తిన్నగా లిఫ్టువద్దకు నడిచాడు.

"ప్రొద్దున కాఫీ తెచ్చింది నువ్వేనా?" అడిగాడు సుధాకర్ ఎదురుగా నిలబడ్డ పొట్టి వ్యక్తిని.

"నేనేసార్!" అన్నాడు అతను.

"నీ పేరు!"

"యాదగిరి సార్!"

"ఎక్కడుండేది?"

"ఇక్కడే సార్!"

"నువ్వు తెచ్చిన కాఫీలో విషం కలిసివుంది. నువ్వే కలిపావా?" సుధాకర్ గద్దించి అడిగాడు.

"నాకేం తెలీదు సార్!"

"నిజం చెప్పు! లేకుంటే నీమీద పోలీసు కంప్లయింట్

యిస్తాను. నువ్వే కలిపావా? లేక మరెవరన్నా కలప మన్నారా?''

''అదేం లేదు సార్! నేను కాఫీ తీసుకొని పైకొచ్చాను. ఒకతను వరండాలో తారట్లాడుతూ కనుపించాడు. కాఫీ ఆర్డాందలా ఆరుకేనా అని అడిగాడు. అవునన్నాను. వేడిగా వుందాని అడిగాడు మళ్ళీ. దానికీ అవునన్నాను. అతనక్కడే నిలబడ్డాడు. నేను గది తలుపు నెట్టాను. రాలేదు. మీరు నిద్రపోతున్నారేమోనని ట్రే అక్కడే పెట్టి డూప్లికేట్ తాళంకోసం వెళ్ళాను. తిరిగొచ్చేసరికి అతను లేడు. బహుశా అతనే కాఫీలో విషం కలిపి వుంటాడు'' అన్నాడు యాదగిరి.

''అతన్ని చూస్తే మళ్ళీ గుర్తుపట్టగలవా?'' అడిగాడు సుధాకర్.

''సులభంగా గుర్తుపడతాను సార్!'' చెప్పాడతను.

''అయితే నువ్వెళ్ళు పిలిచినప్పుడురా!'' చెప్పిపంపాడు.

యాదగిరి వెళ్ళిపోయాడు.

వసంతతో చాలాసేపు తర్జన భర్జన చేశాడు సుధాకర్ కేసు వివరాలు. ఆ రాత్రి కిద్దరూ ఈగల్ బారుకు వెళ్ళాలని నిశ్చయించుకున్నారు.

5

ఆ రోజు రాత్రి తొమ్మిదింటికి బార్‌లో అడుగుపెట్టారు. వెళ్ళి ఒక మూల టేబుల్ వారగా కూర్చున్నారు.

బాయ్ రాగానే డ్రింక్స్, కోడిబిర్యానీ ఆర్డరుచేశాడు సుధాకర్. దూరంగావున్న స్టేజిపైన కాబరేడాన్సు ప్రారంభమయింది. సన్నగా మ్యూజిక్ స్టీరియో స్పీకర్ల లోంచి వినపడుతోంది.

విస్కీ చప్పరిస్తూ డాన్సు చూడసాగాడు సుధాకర్.

సర్వర్లంతా ఉన్నట్టుండి హడావుడి పడసాగారు. స్టేజికి దగ్గరగావున్న టేబుల్ ముందు కూర్చున్న విజిటర్సును అక్కడ్నుంచి బ్రతిమలాడి లేపి మరోచోట కూర్చోపెట్టారు. ఆ టేబుల్ కనపడకుండా నాలుగు వేపులా స్క్రీన్‌లు తెచ్చి అడ్డుపెట్టి చిన్న గదిలా చేశారు.

అంత హడావుడి ఎందుకు జరుగుతుందో అర్థంకాలేదు సుధాకర్‌కు.

సర్వర్ను పిలిచి అడిగాడు.

రాణీ రత్నకుమారి ఈ దినం బార్‌కు వస్తున్నట్లు ఫోన్ చేసింది. ఈగల్ బార్ అండ్ రెస్టారెంటు ఆమెదే. సిటిలోకెల్లా ఖరీదైనదిదేనన్నాడు. అండర్ గ్రౌండ్‌లలో జూదం, ఫస్ట్ ఫ్లోర్‌లో వ్యభిచారం యధేచ్ఛగా సాగిపోతుంటాయనికూడా చెప్పాడు.

పదినిమిషాల తర్వాత ఉలెన్ సూట్ ధరించిన అందమైన పొడవుపాటి కుర్రాడు ముంగు నడుస్తూంటే అతని వెనుకగా రాణీ రత్నకుమారి నడచి రాసాగింది. ఆమె వెనుక ఇద్దరు దాసీలు వున్నారు. రత్నకుమారి కాళ్ళకు అడ్డంపడుతూ తెల్లటి బొచ్చు కుక్క నడవసాగింది. ఆ కుర్రాడేదో ఆమెకు చెప్తున్నాడు. ఆమె విని నవ్వుతూంది. వసంత కూడా ఆమెనే గమనించసాగింది. వాళ్ళు బాగా దగ్గరకొచ్చారు. ఆ కుర్రాడ్ని చూశాడు సుధాకర్. ఎక్కడో చూసినట్లనిపించింది. మెదడుకు పదును పెట్టాడు. జేబులోవున్న ఫోటో వెలుపలికి లాగాడు. అందులోవున్నది అతనే. ఏ విధమైన అనుమానంలేదు. సుధాకర్ కళ్ళు ఆనందంతో మెరిశాయి.

వసంత చెవిలో మెల్లగా ఏదో చెప్పాడు సుధాకర్. ఆమె లేచి వెలుపలకు వెళ్ళింది. సుధాకర్ డ్రింకు త్రాగుతూ కూర్చున్నాడు.

రత్నకుమారి మొహాన బొట్టులేదు. ఆమె భర్త పోయా డేమో ననుకున్నాడు. వసంత లోనికొచ్చింది. వచ్చి తన సీట్లో కూర్చుంది.

"చూశావా?" అడిగాడు సుధాకర్.

"తెల్ల ఇంపాలా కారుంది. అది రాణీ రత్నకుమారిదని అక్కడున్న వాచ్ బాయ్ చెప్పాడు."

సర్వరు కోడిబిర్యానీ తెచ్చిపెట్టాడు.

పదిరూపాయల కాగితం జేబులోంచి తీశాడు సుధాకర్. సర్వరుకు అందిస్తూ "నాకు కావలసిన వివరాలు చెప్తే ఇది నీదే!" అన్నాడు.

రక్కున దాన్ని లాక్కుని "అడగండి!" అన్నాడు వాడు.

"ఇక్కడకాదు! నీ డ్యూటీ ఎప్పుడు ముగుస్తుంది."

"తెల్లారి ఆరింటికి."

"అయితే నువ్వు ఈ రోడ్ చివరనున్న పోస్టాఫీసు దగ్గరుండు. నేనొచ్చి పిల్చుకుపోతాను. నాకు కావలసిన వివరాలు మొత్తం నీ ద్వారా తెలిస్తే పెద్ద కాగితం ఇస్తాను" అన్నాడు సుధాకర్.

"అలాగే సార్!" అన్నాడు సర్వరు.

"ఆ రాణీ గారి ముందు నడిచిన సూట్ వాలా ఎవరు?"

"అతనే రమేష్‌బాబు. ఒకప్పుడు దీనికి మేనేజర్. ఇప్పుడు ఓనరు సార్!" అన్నాడు,

"సరే నువ్వెళ్ళి నీ పని చూసుకో!" అన్నాడు సుధాకర్.

సర్వరు వెళ్ళిపోయాడు.

సుధాకర్ తింటూనే గమనించసాగాడు. స్క్రీన్ల మధ్యనున్న టేబుల్ వైపు సర్వర్లు ఆసులో దారంలా తిరుగుతూనే వున్నారు. వాళ్ళేం త్రాగుతున్నారో, ఏం

తింటున్నారో అంతుపట్టలేదు. అలా దాదాపు మూడు గంటల కాలం గడిచిపోయింది. రాణీ రత్నకుమారి వెలుపలకు వచ్చింది. ఆమె కాళ్ళదగ్గరకు కుక్క తారట్లాడు తూంది. ఆమె ప్రక్కనే రమేష్‌బాబు నడవసాగాడు. ఆమెకన్నా అరడుగు ఎత్తున్నట్లనిపించింది సుధాకర్‌కు. వాళ్ళు టేబుల్స్ మధ్యనుంచి వెళ్ళారు వెలుపలకు.

సుధాకర్ లేచాడు. వసంతకూడా అనుసరించింది. ఇద్దరూ చేతులు పట్టుకుని రాణీగారి వెనకాలే వెలుపలి కొచ్చారు.

ఇంపాలా కారెక్కింది రాణి. అది కదులుతుంటే చెయ్యి ఊపుతూ నిలబడ్డాడు రమేష్. సుధాకర్ అతనితో మాట్లాడుదామనుకున్నాడు. అది సరయిన టయిమ్ కాదని మానుకుని, అక్కడే ఆగివున్న టాక్సీ ఎక్కాడు. వసంత కూడా ఎక్కింది. టాక్సీని హోటల్‌కు పోనిమ్మన్నాడు.

రాత్రి నిద్రపోలేదు. ఐదింటికల్లా డ్రెస్ చేసుకుని ఒంటరిగా బయలుదేరాడు. వసంతను జాగ్రత్తగా వుండమని చెప్పాడు. ఈగల్ బార్ వున్న రోడ్ చివరనున్న పోస్టాఫీసు ముందు నిలుచున్నాడు. చలి ఎక్కువగా వుంది. సిగరెట్ ముట్టించాడు.

ఆరయింది. సర్వారు రాలేదు. ఏడు దాటింది. అతని జాడలేదు. ఓపికగా ఎనిమిదింటిదాకా చూశాడు. అప్పటికీ రాకపోవడంతో ఇంక అతను రాడని తీర్మానించుకున్నాడు. అతనికయి అతనే రాలేదా? లేక తన్ను కలుసుకుంటాడని తెలిసిరానీకుండా చేశారాని ఆలోచించసాగాడు. అక్కడ నిలబడి లాభంలేదని టాక్సీ ఎక్కి తిన్నగా లకిడీకాపూల్ కొచ్చాడు. రామా స్టూడియోలో కడుగుపెట్టాడు.

స్టూడియో ఓనరు బిల్లులు రాసుకుంటున్నాడు. తలెత్తి చూశాడు సుధాకర్‌ను.

"నువ్వు చెప్పకున్నా ఆ ఫోటోవాలను కలుసుకున్నాను" అన్నాడు సుధాకర్.

"ఎక్కడ?" అడిగాడు.

"ఈగల్ బార్ లో."

"ఎప్పుడు?"

"రాత్రి!"

"అతనితో మాట్లాడావా?" అడిగాడతను భయంగా.

"మాట్లాడాను. నా అడ్రసు నీకెవరిచ్చారని అడిగాడు. నీ పేరు చెప్పాను. చాలా సంతోషించాడు. నీకు తగిన బహుమానం ఇస్తానన్నాడు" అన్నాడు సుధాకర్.

అతనికి ముచ్చెమటలు పోశాయి.

"అతన్ని గురించి నీకు నేనేమీ చెప్పలేదు. బుకాయించకు" అన్నాడు.

"బుకాయింపు కాదు. నిజం. అతని పేరు రమేష్. మొన్నటిదాకా రీగల్ బార్ కు మేనేజరుగా వుండేవాడు. ఈ మధ్య దాని ఓనరయినాడు. రాణీ రత్నకుమారి దగ్గర బార్ ను కొన్నాడు. ఈ వివరాలు చాలా? ఇంకా చెప్పాలా?" అడిగాడు సుధాకర్.

అతను తెల్లపోతూ పక్కన ఫోన్ అందుకుని ఏదో నెంబరు డయల్ చేశాడు. కనెక్షను రాగానే అతని పేరూ స్టుడియో పేరూ చెప్పి, గొంతు చించుకుని చెప్ప సాగాడు తనకేం తెలీదని. అవతలి అతను చెప్పిన మాటలు సుధాకర్ కు వినిపించలేదు. అతన్ని వదలి వెలుపలకొచ్చి టాక్సీ ఎక్కి హోటల్ కు వెళ్లాడు.

గదికి వెళ్ళగానే వసంత "మీకు ఫోన్ వచ్చింది మద్రాసునుంచి నాయర్ చేశాడు" చెప్పింది.

"ఏమిటి విశేషాలు?" అడిగాడు కూర్చుంటూ.

"మాయమైన మాధవి కనుపించిందండి."

"ఎక్కడ?"

"ఎన్నూరుదగ్గర సముద్రపు బ్యాక్ వాటర్‌లో ఆమె శవం తారుడబ్బాలో తేలియాడుతూందట. చేపలు పట్టే వాళ్ళు చూసి శవాన్ని పోలీసులకు అప్పగించారట. సుబ్బారావు, మూర్తి వెళ్ళి చూశారట. ఆమె మాధవని గుర్తు పట్టారుట కూడా!" చెప్పింది వసంత.

"ఎలా చనిపోయింది తెలిసిందటనా?"

"ఆఁ! గొంతు నులిమి చంపారట. ఆమె పిడికిట్లో ఒక ఖరీదైన గోల్డ్‌లాకెట్ వుందట. దానిపైన ఆర్ అనే ఇంగ్లీషు అక్షరం కూడా వుందట. మిమ్మల్ని త్వరగా వచ్చెయ్యమని చెప్పారు, నాయర్" అంది వసంత.

"ఐ. సీ" అంటూ తలూపాడు.

"మీ రెళ్ళిన పనేమయింది?"

"ఆ సర్వారు రానేలేదు!"

"అయితే అతన్ని కూడా హతమార్చి వుంటారు" అంది వసంత.

"మనం మద్రాసు వెళ్ళి ప్రయోజనం లేదు. కథానాయకులు ఇక్కడే వున్నారు. మాధవిని చంపిన హంతకుడ్ని పట్టుకున్నాకే మనం వెళ్లేది," అంటూ ఫోన్ తీసుకుని మద్రాసుకు నాయర్‌కు ఫోన్ చేశాడు సుధాకర్.

కనెక్షను దొరకగానే వివరాలు మాట్లాడి, మాధవి శవం ఫోటోలు రెండు సాయంత్రం ఫ్లైట్‌లో ఎవరి ద్వారానన్నా పంపమని కోరాడు. నాయర్ అలాగే పంపుతానని హామీ ఇచ్చాడు.

పేపరు వాళ్ళ కిచ్చేందుకోసం న్యూస్ ఐటమ్‌లా మాధవి హత్య గురించి వివరాలు తయారుచేసి రెండు కాపీలు రాయించాడు వసంత చేత. ఫోటోలు సాయంత్రం చేరాయి. తను రాయించిన రిపోర్టును, ఫోటోనూ, పర్స

నల్‌గా వెళ్ళి రెండు లోకల్ పేపర్ల ఆఫీసుల్లో డెలివరీ చేశాడు.

పోలీసు హెడ్‌క్వార్టర్సులో వున్న తన ఫ్రెండు డి.ఐ.జి. దిగంబరరావును కలుసుకుని, తనొచ్చిన పని గురించి వివరంగా చెప్పి, ఈగల్ బార్ గురించి, అందులో ముఖ్యంగా రమేష్‌బాబు, రాణీ రత్నకుమారి గురించి వీలైనంత సమాచారం అందించమని కోరాడు. మరుసటి దినం వస్తే తప్పక తీయించి వుంచుతానని హామీ ఇచ్చాడు.

6

మర్నాడు డి.ఐ.జి. దిగంబరరావును సుధాకర్ కలుసుకున్నాడు.

కాఫీలు త్రాగాక "నేనడిగిన ఇన్‌ఫర్మేషన్ సంపాదించారా?" అడిగాడు సుధాకర్.

"ఆఁ! రమేష్ అన్నతను ఈగల్ బార్‌కు మానేజర్‌గా వచ్చాక అక్కడ రెండుసార్లు పోలీసు రైడింగ్ జరిగింది. గాంబ్లింగ్, వ్యభిచారం జరుగుతున్నా యక్కడ. కానీ పెద్దవాళ్ళెవరో వాళ్ళమీద కేసు పెట్టకుండా అడ్డుపడ్డారు. రాణీ రత్నకుమారి భర్తయిన రాజా రవిచందర్ ఈమధ్యనే హత్య కాబడ్డాడు. హత్య చేసింది అతని సర్వెంటేనని ససాక్ష్యంగా ఋజువయింది. కానీ అతను పరారయినాడు. అందువల్లేమీ చేయలేకపోయాం," అన్నాడు డి.ఐ.జి.

"మానేజర్‌గా పనిచేసే రమేష్ ఉన్నట్టుండి ఈగల్ బార్‌ను ఎలా కొనగలిగాడో నాకు అర్థంకావడంలేదు. ఇది రాజా రవిచంద్ర గారు బ్రతికివున్నప్పుడే కొన్నారా .లేక చనిపోయాక నా?" అడిగాడు సుధాకర్.

"నాకు తెలీదు" అన్నాడు డి.ఐ.జి.

"రవిచంద్రగారెన్నెలా హత్యచేశాడు సర్వెంట్!"

"ఆ సర్వెంట్ భార్యను రవిచంద్రగారు బలవంతంగా అనుభవించాడట. ఆమె ఆ అవమానం భరించలేక తోటలో వున్న నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం ఒక ఉత్తరం రాసిపెట్టింది. దాన్ని చూసి అతను రెచ్చిపోయాడు. రవిచంద్రగారు తోటలో తిరుగుతూంటే తుపాకీతో కాల్చి చంపాడు. ఆ తర్వాత అతనుగూడ దూకి పారిపోవడం వంటమనిషి చూశాడు. అతని సాక్ష్యంకూడా నమోదుచేశాం."

"ఆ టైమ్‌లో రత్నకుమారి ఇంట్లో లేదా?"

"లేదు! బెంగుళూరు కెళ్ళింది. ఆమె హోటల్‌కు ఫోన్ చేసి చెప్పాం. వెంటనే వచ్చేసింది."

"గుడ్! ఇందులోనే ఏదో తికమక వుంది. నా కా ఫైలివ్వండి. క్షుణ్ణంగా పరిశీలించి తిరిగి మీకు పంపిస్తాను," అన్నాడు సుధాకర్.

డి.ఐ.జి. అందించాడు.

సుధాకర్ దాన్ని బ్రీఫ్ కేసులో సర్దుకున్నాడు. హోటల్‌కు తిరిగొచ్చాడు. వసంతకు చెయ్యవలసిన పనులన్నీ వివరంగా చెప్పాడు. ఏదైనా సహాయం అవసరమైతే డి.ఐ.జి. దిగంబరరావును కలుసుకోమని పురమాయించాడు. తను తిన్నగా ప్లేన్‌లో బెంగుళూరు కెళ్ళాడు.

ఇంపీరియల్ హోటల్‌లో మకాం పెట్టి, రత్నకుమారి ఫోటో చూపించి ఆమె అంతకుముందు ఆ హోటల్‌లో దిగిందాని వాకబుచేశాడు. రిసెప్షనిస్టు, రూం బాయ్స్, క్లీనర్లు ఎవ్వరూ ఆమెను గుర్తుపట్టలేకపోయారు. వాళ్ళకు తన దగ్గరున్న మాధవి ఫోటో చూపించాడు. వాళ్ళు చూసి ఆమె రత్నకుమారి అని ఘంటాపథంగా చెప్పారు. అక్క-

డింకేమీ చేయవలసింది లేకపోవటంతో తిన్నగా మద్రాసు వచ్చాడు.

నాయర్ భాయ్‌ని కలుసుకొని అంతదాకా తను తెలుసుకొన్న విషయాలన్నీ వివరంగా చెప్పాడు. లాకెట్ తెప్పించి చూశాడు. అతని పర్మిషన్ తీసుకొని దాన్ని జేబులో వేసుకున్నాడు.

"నీకు మరో విషయం చెప్పడం మరచాను. పోస్ట్‌మార్టం రిపోర్టు వచ్చింది. మాధవి చనిపోయేముందు గొంతుదాకా విస్కీ తాగిందని డాక్టరు అభిప్రాయపడ్డాడు. ఆమె గొంతునొక్కి చంపారట. గొంతుమీద ప్రెజర్ ఉపయోగించగానే ఆమెకు ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఆగిపోయాయట. ఆ తర్వాత ప్రాణంపోయిందట. అన్నింటినీ మించి ఆమెకు మూడోనెల గర్భమట" అన్నాడు నాయర్.

"రియల్లీ పిటీ! ఆమెను చంపింది ఎవడో క్రొత్తమనిషయి వుండడానికి వీల్లేదు. బాగా తెలిసిన మనిషే అయి వుండాలి. నమ్మి మోసపోయి వుంటుందామె" అన్నాడు సుధాకర్.

7

సుధాకర్ రెండోరోజు ఉదయానికల్లా హైద్రాబాద్ తిరిగొచ్చాడు. హోటల్ గదికి తాళం వేసి వుంది. వెళ్ళి రిసెప్షన్‌లో అడిగాడు. వాళ్ళు తాళం తనకివ్వలేదని చెప్పారు. ముందురోజు రాత్రికూడా అతనితో వున్న స్త్రీ గదికి రాలేదని చెప్పాడు భాయ్. డూప్లికేటు తీసుకుని తలుపులు తెరచి గదిలోకి ప్రవేశించాడు.

వసంత ఏమయింది? రాత్రెందుకు గదికి తిరిగి రాలేదు?

ఆమె ఏమైనా ఆపదలో చిక్కుకుందేమోనని సుధాకర్ మనస్సు కలవర పడింది. వసంత అతని దగ్గర పన్నెండేళ్ళు

నుండీ పని చేస్తూంది. అంత సులభంగా కోరి అపాయం తెచ్చుకోదు. ఆమె ఎక్కడనో క్షేమంగానే వుంటుం దన్న ధైర్యంతోపాటు, హంతకుల ముఠా చేతుల్లో చిక్కి పోయిందేమోనన్న బెంగ మరోప్రక్క కలగసాగింది.

తనెక్కడకు వెళ్తున్నదీ తెలిపే నోట్ ఏమీ రాసి పెట్టినట్లు కనుపించ లేదు. రాత్రంతా రాకుండా ఎక్క డుండి వుంటుందాని ఊహించసాగాడు. అతనికే ఆలో చనా రాలేదు.

మధ్యాహ్నం మూడింటిదాకా వసంత కోసం ఎదురు చూశాడు. ఆమె జాడలేదు. డ్రెస్ మార్చుకున్నాడు సుధాకర్. ముసలి జమీందారులా పెద్ద పెద్ద దుబ్బు మీసాలు ధరించి, గోల్డ్ ఫ్రేమ్ అద్దాలు పెట్టుకున్నాడు. లావుపాటి చేతికర్ర తీసుకున్నాడు. డి. ఐ. జి. దిగంబర రావుకు ఫోన్ చేసి పెద్ద చెవర్లెట్ కారు తెప్పించు కున్నాడు. దిగి క్రిందికెళ్ళి కారెక్కి తనే డ్రైవ్ చేసు కొంటూ ఈగల్ బార్ కు వెళ్లాడు.

కారాగగానే భాయ్ వచ్చి తలుపు తీశాడు. సుధాకర్ దిగి, లాక్ చేసి తాళాలు కోటుజేబులో వేసుకుని కర్ర సాయంతో మెల్లగా అడుగులు వేసుకుంటూ మెల్లె క్కాడు.

బార్ లోకి అడుగుపెట్టబోతూ కుడివేపువున్న గదికి తగిలించిన బోర్డుకేసి చూశాడు. దానిపైన మేనేజింగ్ డైరక్టరు అని రాసివుంది. అటుకేసి నడిచాడు. తలుపు ముందు లావుపాటి మనిషి కూర్చుని కునికిపాట్లు పడు తున్నాడు. కర్రతోనే అతని వీపుమీద తట్టాడు. అతను నిద్ర వదలించుకునేందుకు తల అటూ ఇటూ విదలించుకుని లేచి నిలబడ్డాడు.

"మీ అయ్యగారున్నారా?" అడిగాడు సుధాకర్.

"ఉన్నారు" చెప్పాడు అతను.

"గొల్లపాళెం జమీందారు కుటుంబరావని చెప్పు. అర్జంటుగా మాట్లాడాలి" అన్నాడు సుధాకర్.

అతను లోనికి వెళ్ళి రెండు నిముషాల్లో తిరిగొచ్చి "అయ్యగారు రమ్మంటున్నారు" అన్నాడు.

సుధాకర్ తలుపు త్రోసుకుని లోనికెళ్ళాడు.

రమేష్‌బాబు విస్కీ గ్లాసు టీపాయిపైన పెట్టి "స్వాగతం! సుస్వాగతం!! రండి! కూర్చోండి!!" తూలుతూ ఆహ్వానించాడు.

సుధాకర్ వెళ్ళి అతని కెదురుగా వున్న సోఫాలో జేరబడ్డాడు.

"ఏంకావాలి?" అడిగాడు రమేష్.

"రేపు రాత్రికి పెద్ద పార్టీ ఒకటి ఇవ్వాలనుకుంటున్నాను. చాలామంది మిత్రులు, పెద్దపెద్ద అధికార్లు వస్తారు. ఫారిన్ మందు కావాలి. వీలైతే పదిమంది ఫామిలీ గరల్స్ కావాలి. ఇక తిండి సంగతి సరేసరి. ఏర్పాటు చెయ్యగలరా?" అడిగాడు సుధాకర్.

"ఈ ప్రపంచంలో నేనేదైనా ఏర్పాటు చెయ్యగలను. అయితే ఖర్చుకు వెనకాడకుండా వుండాలి! అంతే!!"

"డబ్బు నాకు సమస్యకాదు. ఎంత కావాలి?"

"ఎంతమందొస్తారు."

"ఇరవై మంది వుంటారు."

"మనిషికి వెయ్యి ఛార్జి చేస్తాను. రీజనబుల్" అన్నాడు రమేష్.

"అంత చీపనుకోలేదు నేను" అన్నాడు సుధాకర్ లెఖలేనట్లు.

"అంతా అడ్వాన్సుగా ముందే ఇవ్వాలి."

"ఓ. కే. చెక్కు రాసిచ్చేదా?"

"క్యాష్ లేదా?"

"ఈ రోజుల్లో అంత క్యాష్ పెట్టుకొని ప్రాణాలు పోకుండా పదిమందిలో తిరగగలమా?"

"చెక్కయినా ఫర్వాలేదు. రాసివ్వండి" అన్నాడు రమేష్.

"ఇలాంటి హోటల్ ఒకటి పెట్టాలని నా కన్నాళ్ళనుండో వుంది. కానీ మానేజ్ చేసేందుకు సరయిన మనిషి కావాలి. దీనికేమాత్రం పెట్టుబడిపెట్టారు."

"దాదాపు ఏడు లక్షలయిందట. నేను రెండు లక్షలకు కొన్నాను" అన్నాడు విస్కీ వొంపుకుంటూ.

"చీప్‌గా కొట్టేశావే!"

"వాళ్ళు మానేజ్ చేసుకోలేక నష్టాలు వస్తుంటే భరించలేక నాకిచ్చారు. నేనుఅమ్మేద్దామనుకుంటున్నాను."

"ఎంత కమ్ముతావ్?"

"ఆరులక్షల కిస్తాను" అన్నాడు రమేష్.

"నువ్వు కొన్నది రెండు లక్షలకే నన్నావ్. అంటే పదిదినాల్లో నాలుగు లక్షలు లాభం అన్నమాట!" అడిగాడు సుధాకర్.

"దీన్ని జాగ్రత్తగా, తెలివిగా నడుపుకుంటే నెలకు పాతికవేలు ఆదాయం వస్తుంది."

"ఇది ఆరులక్షల రూపాయలు విలువచేస్తుందా?"

"అంతకన్నా ఎక్కువ చేస్తుంది. మీకు స్మగ్‌లింగ్ వ్యాపారం లాటిదుంటే నిర్భయంగా సామాను దాచుకునేందుకు అండర్‌గ్రౌండ్ గదు లున్నాయి. అండర్ గ్రౌండ్ నుండే తప్పించుకొని వెళ్ళడానికి మార్గం కూడా వుంది."

"చూపించు. నచ్చితే కొంటాను."

"కొంటానంటే చూపిస్తాను. చూపించాక కొననంటే

ఒప్పుకోను" అన్నాడు రమేష్.

"ఐతే రేపు పార్టీ అయ్యాక నా నిర్ణయం చెప్తాను" అన్నాడు సుధాకర్.

"గుడ్! ఆలోచించుకోండి" అన్నాడు రమేష్.

సుధాకర్ చెక్ రాసిచ్చాడు, మద్రాస్ బేంక్ పైన ఇరవై వేల రూపాయలకు. రమేష్ అందుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు. సుధాకర్ తిరిగొచ్చి కారెక్కాడు.

కారు తిన్నగా రాణీరత్నకుమారి ఇంటికి పోనిచ్చాడు. ఊరి వెలుపల శివార్లలో వుంది బంగళా. చుట్టూ ఇరవై ఎకరాల ఖాళీ జాగాలో రకరకాల చెట్లున్నాయి. గేటు వద్ద నుండి బిల్డింగుకు దగ్గర దగ్గర అరమైలు దూరం వుంది.

కారు పోర్టికోలో ఆపి సుధాకర్ బజర్ నొక్కాడు. గుమ్మం తలుపు తెరచాడు తెల్లటి యూనిఫాంలో వున్న సర్వెంట్.

"రాణీగారున్నారా?" అడిగాడు సుధాకర్. వున్నట్లు తలూపాడు వాడు.

"గొల్లపాళెం జమీందారును. పేరు కుటుంబరావు. మీ అమ్మగారితో చెప్పు అర్జంటు పనిమీదొచ్చానని" అన్నాడు సుధాకర్.

అతను కూర్చోమని సోఫా చూపించి మేడపైకి వెళ్ళి పోయాడు. ఆ తర్వాత ఐదు నిమిషాలకు దిగి క్రింది కొచ్చాడు.

"అమ్మగారు పది నిముషాల్లో వస్తారు" చెప్పాడు అతను.

సరేనని తలాడించాడు. టీపాయిపై నున్న మాగజైన్ తీసి బొమ్మలు చూస్తూ కూర్చున్నాడు.

రాణీరత్నకుమారి దిగి క్రిందికొచ్చింది. సుధాకర్‌కు నమస్కరించింది.

"కూర్చో అమ్మా!" అన్నాడు సుధాకర్.

"మీ పేరు నేనెప్పుడూ వినలేదు! నాతో ఏదో పనుందన్నారుట. చెప్పండి" అంది రత్నకుమారి పట్టుచీర పేటంచు సర్దుకుంటూ మునిత్రేళ్ళతో.

"మీ హీరో నేనూ కలిసి చదువుకున్నాం. వరే వరే అని పిలుచుకొనే వాళ్ళం. వాడ్ని మీ సర్వెంట్ ఎవరో హత్య చేసినట్లు పేపర్లో చదివాను. వాడి మొదటి భార్యతో రెండుసార్లు నా ఎస్టేటుకు వచ్చి రెండుసార్లు మకాం వేసి పోయాడు. మిమ్మల్ని తీసుకురానేలేదు" అన్నాడు సుధాకర్ అంతా కల్పించి చెప్తూ.

"నా పెళ్ళయి ఆరు మాసాలయింది. ఇంతలోనే ఈ ఆపద ముంచుకొచ్చింది. నన్నిలా అన్యాయం చేసి వెళ్ళి పోయారు" అంది రత్నకుమారి.

"బాధ పడకమ్మా!" అంటూ ఓదార్చాడు.

"ఇంతకూ నాతో ఏం పనుండి వచ్చారో చెప్పనే లేదు" అంటూ గుర్తు చేసింది రత్నకుమారి.

"ఈగల్ బార్‌కు వెళ్ళా నీదినం. అదింకా మీ దేననుకున్నాను. అమ్మేశారటగా. అతని పేరేదో చెప్పాడు. ఆఁ! రమేష్ అనుకుంటాను. అతను దాన్ని అమ్ముతానన్నాడు."

"మీరు కొంటారా?"

"కొందామనే! అయితే ఆరు లక్షలు చెప్తున్నాడు."

రత్నకుమారి మాట్లాడలేదు.

"మీరు అతనికి దాన్ని రెండు లక్షలకే అమ్మినట్లు తెలిసింది. నా దగ్గర నాలుగు లక్షలు ఎక్కువ ఉన్నాయి

లనుకుంటున్నాడు. అంత చీప్ గా అమ్మేయడానికేమైనా కారణాలున్నాయా?" అడిగాడు సుధాకర్.

"అంటే మీ ప్రశ్న నాకర్థంకాలేదు."

"ఎలాగోలా వదిలించుకుందామనుకున్న పరిస్థితుల్లో మీరు అమ్మేశారేమోనన్న అనుమానం వచ్చింది. ఎక్కువ డబ్బిచ్చి లేనిపోని తలనొప్పి కొని తెచ్చుకోవడం మాత్రం దేమోనన్న భయంతో మిమ్మల్ని సంప్రదించాలని వచ్చాను" అన్నాడు సుధాకర్.

"ఆయనుండగా అన్నీ ఆయన చూసుకునేవారు. నాకు వీటి గొడవలు తెలీవు. అక్కడన్ని రకాల జూదాలు జరుగుతుంటాయట. ఆ సమానం పోలీసులతో పని. ఆడదాన్ని. ఆ గొడవలు పడలేనన్న భయంతో ఇంతదాకా మేనేజరుగానున్న ఆ రమేష్‌కు అమ్మేశాను" అంది రత్నకుమారి.

"అంతేగదా?" అడిగాడు సుధాకర్.

"అంతే!" అంది రత్నకుమారి.

సర్వెంట్ రెండు కప్పుల కాఫీ ట్రేలో పెట్టుకొచ్చాడు. ఇద్దరూ తాగారు. "రవిచంద్ర లేకుంటే ఇల్లంతా చిన్నబోయినట్లుంది!" అన్నాడు లేస్తూ.

8

సుధాకర్ వెళ్ళగానే ఫోన్ తీసుకుని ఈగల్ బార్‌కు రింగ్ చేసింది.

అవతలి వేపునుండి "హల్లో!" అన్న శబ్దం వినిపించగానే "ఎవరు? రమేషేనా?" అడిగింది.

"ఆఁ!" అన్నాడు రమేష్.

"నీకా క్లబ్ ఇచ్చింది లాభానికి అమ్ముకునేందుకు కాదు! బతకడానికి" అంది కోపంగా రత్నకుమారి.

"నా పని చచ్చేట్లుంది. పోలీసులు, డిటెక్టివ్‌లు చుట్టుకుంటున్నారు. వాళ్ళల్లో ఒకతెను తెచ్చి క్లబ్‌లో దాచి పెట్టాను. నా గొడవ బైట పడకముందే ఇక్కడ్నుంచి మకాం ఎత్తేద్దామనుకుంటున్నాను. నీ పాపం కూడా పండకముందే ఎటైనా వెళ్ళిపో!" సలహా ఇచ్చాడు రమేష్.

"నోర్మూయ్యి! నేనెవరో తెలిసే మాట్లాడుతున్నావా? నాకున్న డబ్బుతో ఎవరి నోరైనా మూయించగలను" అంది రత్నకుమారి.

"సరే! నీ పాట్లు నువ్వు పడు. నేను క్లబ్ అమ్మి డబ్బు తీసుకుని ఎటైనా వెళ్ళిపోతాను" అన్నాడు.

"నో! నేనొప్పుకోను. అలా చేశావంటే నేనే నిన్ను పట్టిస్తాను. నాకు లేనిపోని ఆశలు పెట్టావ్. వాడుకున్నావ్. మనకు అడ్డుండగూడదని నా భర్తను చంపించావ్. ఇంత చేశాక ఇప్పుడు నీ సుఖం చూసుకుంటానంటే చూస్తూ వదిలేస్తాననుకోకు. నీ పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టు. బుద్ధిగా బార్ నడుపుకుంటూ వుండు" అంది రత్నకుమారి.

"నాతో అనవసరంగా తలపడకు. నీ బ్రతుకు బజారున పడేస్తాను" బెదిరించాడు రమేష్.

"అదీ చూద్దాం! ముందా ఆడమనిషిని వదిలించుకో. లేకుంటే ఆమెకోసం వెతుకుతూ వస్తారు పోలీసులు. అప్పుడు చిక్కిపోతావ్" అంది రత్నకుమారి.

"నేనేం చెయ్యాలో నాకు చెప్పనవసరం లేదు" అంటూ రోషంగా ఫోన్ క్రేడిల్ పైన పడేసిన చప్పుడు కావడంతో రత్నకుమారి ఫోన్ క్రింద పెట్టింది.

9

రాత్రి పదిగంటలయింది.

సుధాకర్ నల్లటి సూటు ధరించాడు. హోటల్ గదికి తాళం వేశాడు. క్రిందికొచ్చి కారెక్కి రత్నకుమారి ఇంటికి పోనిచ్చాడు. బంగళాకు దూరంగా కారాపి దిగాడు. చిన్న పెన్ టార్చి తీసుకొని కాంపౌండ్ గేట్ దగ్గర కొచ్చాడు. దూరంగా వున్న బంగళాలో లైట్లు ఆరిపోయి వున్నాయి. అంటే అంతా నిద్రకు ఉపక్రమించి వుండాలనుకున్నాడు సుధాకర్. గోడవారగా నడచి బంగళా వెనక్కి వెళ్ళాడు.

కాంపౌండ్ గోడదూకి తోటలోకి అడుగుబెట్టాడు. అతను దూకిన ప్రదేశానికీ, బంగళాకు దాదాపు అరమైలు దూరం వుంది. టార్చిలైటు వేసుకుంటూ నడిచాడు. వంద గజాలు పోయాక సర్వెంట్ క్వార్టర్సు కనుపించాయి. వాటికి దగ్గరో బావి కనుపించింది.

బట్టలు విప్పిపెట్టాడు. డ్రాయరు, బనీనుతో చేదతాడు పైనున్న కొయ్యకుకట్టి నీళ్ళలోకి వదిలాడు. మెల్లగా త్రాడు పట్టుకొని క్రిందికి దిగాడు. చాలాదూరం దిగాడు. నీళ్ళు కాళ్ళకు తగిలాయి. తాడు పట్టుకొని లోనికి మునిగాడు. నీళ్ళంతో లోతు లేకపోవటంతో త్వరగానే అడుగు తగిలింది. కాళ్ళతో నేలంతా తడిమాడు. కాళ్ళకు మెత్తగా తగిలింది. లోనికి వంగి కూర్చుని చేతులతో తడిమాడు. మనిషి ఆకారం తాలూకు చేతులూ కాళ్ళు తగిలాయి. విపరీతమైన వాసన వేసింది. ఆ వాసననుబట్టే బావిలోకి దిగాడు సుధాకర్. శవం బాగా కుళ్ళిపోయి వుంది.

శవంచుట్టూ చేతులతో వెతికాడు. పొడవుపాటి తుపాకీ తగిలింది. దాన్ని చేతికి తీసుకుని పైకివచ్చాడు.

నీళ్ళమీద త్రాడు పట్టుకుని కూర్చుని కాసేపు రెస్ట్ తీసుకున్నాడు. ఆ తర్వాత దన్నుపట్టి త్రాడు ఆధారంగా చేసుకుని మెల్లగా గోడకు కాళ్ళు తన్నిపట్టి పైకి ఎక్కసాగాడు. పాగాలు బాగా తడిసి వుండటంతో జర్రున క్రిందకు జారిపోయాడు. నీళ్ళల్లో పడిపోకుండా తట్టుకున్నాడు. తుపాకీ పట్టుకుని పైకి రావడం చాలా కష్టమైంది సుధాకర్‌కు. తంటాలుపడి అరగంట తన్నుకులాడి పైకిచేరాడు తుపాకీతో సహా. కోటు జేబులోంచి జేబురుమాలు తీసుకుని తలంతా బాగా తుడుచుకున్నాడు. మళ్ళీ సూట్ యథాప్రకారం వేసుకుని, సర్వెంట్ క్వార్టర్సువైపు వచ్చాడు. లోపల లైటు వెలగసాగింది.

సుధాకర్ దాన్ని చూచి విస్తుపోయాడు. అంతకుముందు తను వస్తూ చూశాడు. లైట్లు ఆరిపోయి వున్నాయి. తను బావిలో దిగి పైకొచ్చేసరికి లైట్లు వెలుగుతూ కనుపించాయి. అంటే ఎవరో వచ్చి వుండాలనుకున్నాడు. చెట్లచాటున నక్కిదాక్కుంటూ మెల్లగా క్వార్టర్ గోడవారజేరాడు. అక్కడ్నుంచి చప్పుడు చెయ్యకుండా ముందుకు కదలి కిటికీవద్దకు పోయాడు. అద్దాల తలుపులు మూసివున్నాయి.

లోనికి చూశాడు.

అక్కడి దృశ్యం అతన్ని ఆశ్చర్యంతో ముంచివేసింది.

రమేష్‌ను పెడరెక్కలు కట్టివున్నారు. అటూ ఇటూ ఇద్దరు లావుపాటి మనుషులు వున్నారు. అతని కెదురుగా రత్నకుమారి నిలబడివుంది. మగపిల్లాడిలా పాంటు, షర్టు వేసుకుంది. చేతిలో లెదర్ హంటర్ పట్టుకొని వుంది.

లోపలి వాళ్ళ సంభాషణ చెవి ఒగ్గి వినసాగాడు సుధాకర్.

"నిన్నిలా ఎందుకు చేశానో తెలుసా?" అడిగింది రత్నకుమారి.

"తెలుసు. ఒళ్ళు అమ్ముకొని బ్రతికే నిన్ను రాజా రవిచంద్ర అర్ధాంగిగా చేసి అందలం అందించిన నేరానికి నాకు నువ్వు బహుమానం ఇచ్చేందుకు" అన్నాడు రమేష్.

"శౌర్యయ్యా! నువ్వేంటి చేసింది. నా అందం నాకా అందలం ఎక్కే అవకాశం కలిగించింది" అంది రత్నకుమారి.

"నన్నెందుకు రప్పించావ్?"

"బుద్ధి చెప్పేందుకు."

"ఏమని?"

"నా మాట వింటూ, నా చేతిక్రింద నీళ్ళు త్రాగుతూ వుంటానని మాటిస్తే నిన్ను వదిలేస్తాను. లేకుంటే నిన్ను రెండు రకాల బాధ పెడతాను."

"అదేదో వివరంగా చెప్పు!"

"ఒకటి నా మనుషులచేత నిన్ను కత్తులతో కండ కండ ఒలిపించి కాకులకు, గ్రద్దలకు వేస్తాను. లేదంటే ఈగల్ బార్‌లోని లక్ష్మయ్యను, రాంసింగ్‌ను నువ్వెలా చంపించిందీ వివరంగా పోలీసులకు తెలియజేసి తిన్నగా ఉరికంబ మెక్కించే ఏర్పాట్లు చేస్తాను. నువ్వేది కోరుకుంటావ్" అడిగింది రత్నకుమారి.

"నిస్సహాయుణ్ణిచేసి చంపడం పెద్ద గొప్పకాదు. ఇక నా గురించి పోలీసులకు చెప్పాక నీవుమాత్రం సుఖంగా వుంటావని అనుకోకు. నాతోపాటే నువ్వూ ఉరికంబ మెక్కుతావ్?" అన్నాడు రమేష్.

"ఎందుకు?"

"నీ భర్తను తుపాకీతో కాల్చి చంపినందుకు."

"అలాగని ఎవ్వరూ ఋజువు చెయ్యలేరు. నా భర్త

చనిపోయిన రోజు నేను ఇక్కడ లేనేలేను.''

''రోజా నీ పేరుమీద నటించింది. ఆమె ద్వారా నీకు అపాయం రాకుండా వుండేందుకు ఆమెను నమ్మించి మోసం చేసి చంపాను. ఆ వివరాలన్నీ నేను పోలీసులకు చెప్పగలను'' అన్నాడు రమేష్.

''అంతటి ఘనుడివని తెలిసే ఇలా నమ్మించి పిలిపించింది నన్ను. నువ్వు ఈ దినం నుండి నా ఖైదీవి. బుద్ధొచ్చిందని చెప్పి లెంపలేసుకున్న దాకా నిన్నిక్కడే వుంచి నీళ్ళు కూడా ఇవ్వకుండా మాడుస్తాను'' అంది రత్నకుమారి.

ఆ తర్వాత ఆమె వెలుపలకు వచ్చేసింది. ఆమె వెంట అనుచరులందరూ కూడా వెలుపలికి వచ్చారు. తలుపులకు తాళం పెట్టారు. అక్కడ్నుంచి కదిలి బంగళా వైపు వెళ్ళిపోయారు.

సుధాకర్ నిల్చుని అంతా పరిశీలించి చూశాడు. తాళాలు పగులగొట్టి రమేష్‌ని వదిలించుదామనుకున్నాడు. కానీ అతను తనతో సహకరిస్తాడన్న నమ్మకం కలగలేదు. కారణం అతను మూడు హత్యలు చేసిన హంతకుడు గావటమే.

ముందు వసంతని విడిపించడం అవసరమనిపించింది. ఆ తుపాకీ తీసుకుని మెల్లిగా బయలుదేరాడు కాంపౌండు గోడవేపు. చెట్లచాటున నక్కుతూ మనుషుల అలికిడి విని పిస్తుందేమోనని మాటమాటకీ ఆలకించి వింటూ దూరాన్ని వెనక్కి నెట్టుకుపోవడం మొదలుపెట్టాడు.

కాంపౌండు గోడ రెండు చేతుల్తోటి అందుకుని బలమంతా కాళ్ళలోకి తెచ్చుకుని ఎగిరాడు. కాళ్ళు పైకి రాలేదు. ఎవరో క్రిందకు గుంజినట్లు తోచింది. పట్టు జారిపోయింది. దబ్బున పడిపోయాడు. అంతకుముందు రమేష్‌ని కట్టిపడేసిన ఇద్దరూ కనుపించారు. చీకట్లో కూడా వాళ్ళ

కళ్ళలోని ఎరుపు చింతనిప్పల్లా కణకణ మండుతూ కనుపించింది.

"ఎవరు నువ్వు?" అడిగాడొకతను.

"మీ రెవరు?" అడిగాడు సుధాకర్ వాళ్ళను.

"నీ మొగుళ్ళం" అన్నారిద్దరూ కసిగా.

"పెళ్లాడుతారా?"

"ఆఁ! రా!" అంటూ నాలుగు చేతులు ముందుకొచ్చాయి. సుధాకర్ అడుగు వెనక్కి వేశాడు. వాళ్ళు పైకి దూకారు. పిల్లిమొగ్గ వేశాడు సుధాకర్. ఇద్దరితలలూ గోడకు తగిలాయి. ఠక్ మన్నాయి.

వాళ్ళ మెదళ్లు చిట్లిపోయి వుండాలనుకున్నాడు, ఆ దెబ్బకు. ఇంక లేవటం అసాధ్యమనుకొని వాళ్ళకేసి చూశాడు. ఏమీ జరగనట్లు పైకి లంఘించి, సుధాకర్ రెక్కలు చేరొకటి పట్టుకున్నారు రెండు చేతుల్తో. కుడి కాళ్లు నడుంపైన పెట్టి బలంగా గుంజారు.

నడుము పెళపెళ మంది. వెన్నుపూస జాయింట్లు ఊడిపోయినట్లు తోచింది సుధాకర్ కు. సుధాకర్ నేలవాలాడు. ఒకడు సుధాకర్ కి అటూ ఇటూ రెండు కాళ్లు పెట్టి వంగి, రెండు చేతులూ గొంతుపైన పెట్టాడు నొక్కేందుకు.

"ఏం చేస్తున్నావురా?" అడిగాడు ప్రక్క నున్న రౌడీ.

"చంపుతున్నాను" అన్నాడు వాడు.

"వద్దు! అమ్మగారికి చూపిస్తే మంచిది. వీణ్ణి కూడా పట్టుకెళ్ళి ఆ కొట్లో పారేసి తాళం పెడదాం!" అన్నాడు.

అతని సలహా నచ్చినట్లుంది. గొంతుపైన వేసిన చేతులు తీశాడు. సుధాకర్ ముక్కుపుటాలు పెద్దవి చేసి గాలి పీల్చుకున్నాడు గుండెల నిండా. ఇద్దరూ అతన్ని లేవ

నెత్తి, తన్నుకుంటూ, త్రోసుకుంటూ సర్వెంట్ క్వార్టర్సు వైపు లాక్కెళ్లారు.

ఒకడు తాళం తీసి, తలుపు తెరిచాడు.

రెండోవాడు సుధాకర్ ను లోనికి త్రోశాడు.

మళ్ళీ తలుపులు బిడాయించారు. గొళ్లెం లాగి తాళం కప్ప తగిలించి, చెవి అందులో పెట్టి త్రిప్పారు.

సుధాకర్ దగ్గర చేజిక్కించుకున్న తుపాకీ మోసుకుని బంగళా వేపు బయలుదేరారు.

10

వసంతకు స్పృహ వచ్చింది. కళ్ళు తెరచి చూసింది. కిటికీలాంటి దేదీ లేదు. మెట్లు మాత్రం కనుపించాయి. మెల్లగా లేచి మెట్లెక్కింది. వాటి చివర్న తలుపుంది. అది తాళం వేసివుంది. ఆ ఏర్పాటును బట్టి తను నేలమాళిగలో కట్టిన గదిలో వున్నానన్న విషయం అర్థమైంది.

జరిగింది గుర్తుకు తెచ్చుకోసాగింది.

సుధాకర్ వెళ్ళిన తర్వాత, తను రాత్రి ఎనిమిదింటికి ఈగల్ బార్ కు వచ్చింది. బార్ లో రామా స్టుడియో ఓనరు కనుపించాడు. తను వెళ్ళి కూర్చోగానే మిగిలిన ఖాళీ కుర్చీల్లో ముగ్గురు రౌడీలు వచ్చి కూర్చున్నారు. లేచి పోదామనుకుంది ముందు. కానీ వాళ్ళకు భయపడి వెళ్ళి నట్లుగా వుంటుందని సందేహించి కూర్చుందక్కడే.

విస్కీ తెప్పించుకున్నారు.

త్రాగుతూ, అడ్డదిడ్డంగా వాగుతూ వుండిపోయారు. ఒకడు తన చెయ్యి పట్టుకున్నాడు. మరొకడు లేచి వీపు పైన చెయ్యి వేశాడు. ఇంకొకడు గ్లాసులో విస్కీపోసి త్రాగమని అందించాడు. అందర్నీ తిట్టి వెళ్ళిపోదామని లేచింది.

వెళ్ళనీకుండా చుట్టూ నిలబడ్డారు. తను చాలా ప్రమాద స్థితిలో చిక్కుకున్నట్లు తెలుసుకొంది.

"హెల్ప్! హెల్ప్!!" అని అరిచింది.

అంతమంది జనంలో ఎవ్వరూ ముందుకు రాలేదు ఆ రౌడీల బారినుండి తన్ను రక్షించడానికి. అంతా బొమ్మల్లా జరుగుతున్నది చూస్తూ వినోద కాలక్షేపం చెయ్యసాగారు.

ఉన్నట్టుండి లైట్లారిపోయాయి.

తన్ను ఎవరో ఎటో బలవంతంగా లాక్కుపోతున్నట్లు గమనించింది. శరీరంలోని శక్తినంతా కూడగట్టుకొని వాళ్ళతో పోరాడింది. కానీ లాభం లేక పోయింది. మూడు మగమృగాల బలం ముందు సహజంగానే అబలయిన తను ఓడిపోక తప్పలేదు.

లైట్లు వెలిగాయి.

తనచుట్టూ ముగ్గురు రౌడీలున్నారు.

ఎదురుగా రాకింగ్ ఛెయిర్‌లో కూర్చుని సిగరెట్ త్రాగుతూ రమేష్ కనుపించాడు.

"నువ్వే ప్రఖ్యాత డిటెక్టివ్ సుధాకర్ అసిస్టెంటు వసంత వన్న విషయం ఈ దినమే తెలిసింది. ఎవరో నా గురించి వాకబు చేస్తున్నారని రామా స్టుడియో మూర్తి చెపితే పోలీసు లనుకున్నాను. కాఫీలో విషం కలిపి పంపాను. తెలివిగా అపాయం తప్పించుకున్నారు. నా మనుషులకు డబ్బు ఎరచూపి నేను చేసిన దురాగతాల గురించి సమాచారం సేకరించ ప్రయత్నించారు" అన్నాడు రమేష్.

"వాళ్ళిద్దర్నీ చంపావుగా?" అడిగింది.

"తప్పు! అలాగనకు. చంపించాను. అంతే."

"అంతే అయినా ఆ నేరాలకు శిక్షంతా నీ నెత్తినే పడుతుంది. తెలుసా?" అడిగింది తను.

"ఈ తల చాలా విలువైనది. దీనిపైన శిక్షలు పడకుండా తగిన రక్షణలు ఎప్పుడో చేసి వుంచుకున్నాను. నిన్నూ, నీ బాస్‌ను యమలోకం పంపానంటే నాకెదురు లేదు. అందుకు తగిన ఏర్పాట్లు చేశాను. ఇంతకీ వాడేడి!"

"నీ గొంతును బిగించేందుకు ఉరితాడు తయారు చేసుకుని వచ్చేందుకు వెళ్ళాడు" అంది తను కోపంగా.

"ఎప్పుడొస్తాడు?"

"తెలీదు!"

"మంచిదే! రాగానే అతన్నికూడా ఇక్కడే పిల్చుకొస్తాను. ఇద్దర్ని కలిపి చంపుతాను. అంతదాకా నా ఖైదీగా వుండు" అన్నాడు రమేష్.

రౌడీలు ముగ్గురూ లాక్కుపోయారు ఇంకో గదిలోకి. తన కాళ్ళూ చేతులు పట్టుకున్నారు కదలకుండా. ఇంకోకతను ఏదో మందు సిరంజి ద్వారా లోని కెక్కించాడు. మందు లోపలకెక్కగానే స్పృహపోయింది.

పోయిన స్పృహ మళ్ళీ ఇప్పుడే వచ్చింది.

సుధాకర్ తిరిగి వచ్చివుంటే ఈ పాటికి తనకీ చెరసాల నుండి మోక్షం జరిగుండాలి. మరి రాలేదేమో. వెళ్ళిన పనులుకాక ఆగిపోయారేమోననుకుంది.

కడుపులో ఆకలి బయలుదేరింది.

మళ్ళీ వెళ్ళి తలుపు తట్టింది.

తలుపులు తెరచుకున్నాయి.

ఎదురుగా రాక్షసుడిలాంటి మనిషి ప్రత్యక్షమయినాడు.

"ఏం కావాలి?" అడిగాడు.

"ఆకలవుతూంది. తినేందు కేమయినా తెచ్చిపెట్టు" అంది వసంత.

"నీకేం పెట్టొద్దన్నారు" అన్నాడతను.

"ఎటూ నన్ను చంపుతారు. చంపాక ఆకలి తెలీదు.

ప్రతిక్షణం లేచే ఆకలవుతూనే వుంటుంది. ఆ బాధ భరించడం ఎంత కష్టమో నీకు తెలీదు. నాకు చాలా ఆకలిగావుంది. ఏమైనా తెచ్చిపెట్టు'' గోముగా అడిగింది వసంత.

వాడు ఆమె మాటలతీరుకు చల్లబడ్డాడు. మెదడులో పిచ్చి కోరికలు రేగాయి.

''నీకేం కావాలన్నా తెచ్చిపెడతాను. నాకు ఏం కావాలంటే అది ఇస్తావా?'' అడిగాడు నఖశిఖ పర్యంతం గమనిస్తూ.

''ఇస్తాను. నాకు అన్నం, కారం బాగా వేసిన సాంబారు మజ్జిగ తెచ్చిపెట్టాలి. నోరు బాగా రుచి చెడివుంది'' అంది వసంత.

అలాగే అంటూ అతను వెళ్ళిపోయాడు.

పది నిముషాల తర్వాత ఒక గిన్నెలో సాంబారు, మరో గ్లాసులో మజ్జిగ పట్టుకొని ఒంటిగిన్నె క్యారియర్‌లో అన్నం పెట్టుకొచ్చాడు.

''తిను! త్వరగా తిను!'' అన్నాడు అతను ఎదురుగా కూర్చుని.

వసంత సాంబారు గిన్నె వాసన చూసినట్లే, ఉడుపుగా మోహంమీద పడేట్లు కొట్టింది. అదంతా కళ్ళలోకి పోయి మంట పుట్టుకొచ్చిందతనికి. ''అమ్మో మంట!'' అంటూ డాన్సు చెయ్యనారంభించాడు.

వసంత వడివడిగా వెలుపలికొచ్చి తలుపులు మూసి గొళ్లెం పెట్టింది. అక్కడ్నుంచి సునాయాసంగా రెండు నిముషాల్లో వీధిలోకి రాగలిగింది. టాక్సీ ఎక్కి హోటల్ పేరు చెప్పి పోనిమ్మంది.

ఆఘమేఘాలమీద వెళ్ళింది టాక్సీ. దిగి రిసెప్షనులో డబ్బు తీసుకుని టాక్సీవాలాకు చెల్లించి, గదికి వెళ్ళింది. టీపాయ్‌పైన కాగితం పెట్టివుంది. తీసుకొని చదువుతుంది.

సుధాకర్ తనకోసం రాసివుంచాడు. తను రాణీ రత్నకుమారి ఇంటికి వెళ్తున్నాననీ, ఒకవేళ తను తిరిగొచ్చి ఉత్తరం చూస్తే వెంటనే డి.ఐ.జి. దిగంబరరావును కలుసుకోవలసిందని వుందందులో.

బట్టలు మార్చుకుని పర్సులో కొద్దిగా డబ్బు, చిన్న రివాల్వరు పెట్టుకొని క్రిందకు దిగివచ్చింది. టాక్సీ మాట్లాడుకుని డి.ఐ.జి. ఇంటి అడ్రసు చెప్పి పోనిమ్మంది.

దిగంబరరావు వసంతను చూచి ఆమె తన్ను పరిచయం చేసుకోగానే కూర్చో బెట్టి అంతా విన్నాడు.

"నన్నేం చెయ్యమంటావ్!"

"సుధాకర్ గారు రత్నకుమారి గారింటికి వెళ్ళారు. వారు టైం పది గంటలని రాశారు. ఇప్పుడు దాదాపు తెల్లవారస్తూంది. అంటే ఆయనేదో ఆపదలో చిక్కుకొని వుండి వుంటారు. మనం తగిన బలగంతో అక్కడికి పోవడం అవసర మనిపిస్తూంది" అంది వసంత.

"అలాగే వెళ్దాం!" అంటూ లోనికెళ్ళి రెండు మూడు ఫోన్ కాల్స్ చేసి, డ్రెస్ వేసుకునివచ్చి జీపు ఎక్కి కూర్చున్నాడు. వసంత కూడా ఎక్కింది.

* * *

వేకువఝాము ప్రాంతంలో సుధాకర్‌కు ఒళ్ళు తేలికగా వున్నట్లనిపించింది. లేచి కూర్చున్నాడు. రమేష్ అటూ ఇటూ పచార్లు చేస్తూ కనుపించాడు.

"డిటెక్టివ్ వు నువ్వేనా?" అడిగాడు.

"నేనే!"

"నీ అసిస్టెంటును నా హోటల్‌లో బంధించాను–నేను నీశ్శ చేతిలో బందీగా చిక్కాను" అన్నాడు రమేష్.

"నువ్వు ఎండమావుల వెంటపడ్డావని ఇప్పటికయినా

అర్థమైందా? ఆమె మాయలోపడి మాధవిని అనవసరంగా హత్యచేశావ్. ఎందుకు?" అడిగాడు సుధాకర్.

"మాధవీ, రత్న ఈగల్ క్లబ్ లో డాన్సు చేసేవాళ్ళు. ఇద్దరూ దాదాపు ఒకలాగే వుండేవాళ్ళు. మాధవి నన్ను ప్రేమించింది. రత్న కూడా ప్రేమించింది. నన్ను కాదు ఈగల్ బార్ ఓనర్ రవిచంద్రగారి దగ్గరున్న డబ్బును. నేను మాధవిని ప్రేమించలేకపోయాను. రత్న నన్ను ఆకట్టుకుంది. రవిచంద్రకు, ఆమెకు పరిచయం చేశాను. వాళ్ళిద్దరూ రాసక్రీడల్లో తేలియాడుతుండగా దొంగతనంగా ఫోటోలు తీయించాను. వాటి సాయంతో ఆయన్ను భయపెట్టి రత్నను పెళ్ళిచేసుకునేట్లు చేశాను.

ఆ తర్వాత అతని ఆస్తి కాజెయ్యాలన్న ఆశపుట్టింది. అతను ధనస్తే మొత్తం రత్నకే వస్తుంది. మాధవిని ప్రేమించినట్లు నటించి రత్న పేరుమీద ఆమెను బెంగుళూరుకు పంపాను. ఒక రాత్రి రత్న సర్వెంట్ దుస్తులు వేసుకొని రవిచంద్ర తోటలో తిరుగుతుండగా చంపేసింది. తర్వాత సర్వెంట్ ను చంపి, శవానికి బండకట్టి బావిలో పారేసింది. మాధవిని రప్పించాను.

రత్న అప్పుడే బెంగుళూరునుండి వచ్చినట్లు నటించింది. పోలీసుల అనుమానం సర్వెంట్ పైన వెళ్ళేట్లు తప్పుడు సాక్ష్యాలు చెప్పించాం. దాంతో వాళ్ళు ఆ సర్వెంట్ ను వెతుక్కోవడంలో పడిపోయారు.

మాధవి నన్ను పెళ్ళి చేసుకోమంది. రత్న అందుకు వ్యతిరేకించింది. ఆమెకు విషయం చెప్పకుండా మద్రాసు పంపాను. నేను కూడా కొంత డబ్బు తీసుకొని త్వరలోనే వచ్చి కలుసుకుంటున్నాను. అప్పుడప్పుడూ కాంటినెంటల్ హోటల్లో హైద్రాబాదునుండి సురేష్ అనే

అతను వచ్చాడేమో అడిగి తెలుసుకుంటూండమని చెప్పాను.

త్వరలో రాకుంటే రత్న పేరుతో తను బెంగుళూరులో మకాం వేసిన విషయం పోలీసులకు చెప్తానంది. దాంతో మేమిద్దరం భయపడ్డాం. ఆమెను నేనే చంపి ఎన్నూరు దగ్గర నీళ్ళల్లో పారేశాను. ఆ తర్వాత జరిగింది మీకు తెలుసు'' అన్నాడు రమేష్.

అంతలో తలుపులు తెరచుకొన్నాయి.

ఎదురుగా డి.ఐ.జి. దిగంబరరావు, వసంత కనిపించారు. రత్నకు బేడీలు వేసివున్నారు.

సుధాకర్ ''పాపం సుబ్బారావు మాధవి మాయమయిందనుకున్నాడు. ఆమెను హత్య చేశారని తెలిస్తే గుండె ఆగి మరణిస్తాడేమో'' అన్నాడు.

అందర్నీ జీపెక్కించి సెంట్రల్ జైలువైపు పోనిమ్మన్నాడు దిగంబరరావు.

సుధాకర్, వసంత కారెక్కి హోటల్‌కు బయలు దేరారు.

—: ఐపోయింది :—